# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 23, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం -22- మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ఇజ్రాయెల్ ప్లాన్!

అమెరికా నిఘా వర్గాల తాజా నివేదికలో వెల్లడి

ఇజ్రాయెల్ తుది నిర్ణయంపై ఇంకా స్పష్టత కరవు




అమెరికా-ఇరాన్ అణు ఒప్పందం ఫెయిలైతే దాడుల ముప్పు అధికం

ఇరాన్‌తో చర్చలకు ట్రంప్ పెట్టిన 60 రోజుల గడువు పూర్తి

## కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ అమ్మేస్తుంటే



కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కార్మికులను తొలగిస్తూ, ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనిని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా

మిగతా.. 2లో

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ పై ప్రధాని మోదీ ఏమన్నారంటే...!

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్, 27 మంది మావోయిస్టుల మృతి




మావోయిస్టు అగ్రనేత బసవరాజు హతమైనట్లు అమిత్ షా వెల్లడి

భద్రతా బలగాల విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు




కుంకీ ఏనుగులను నేనే జాగ్రత్తగా చూసుకుంటా...

ఏపీ ప్రజల కోసం వీరు హృదయాలనే తెరిచారు

ఏపీకి ఐదు కుంకీ ఏనుగులను అందించిన కర్ణాటక ప్రభుత్వం

కర్ణాటక విధానసౌధలో ఏనుగులను స్వీకరించిన పవన్

# యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
# ఘనతే మోదీదే

- ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్పవరం యోగా
- ఏపీ చరిత్రలో నూతన అధ్యయనం
- యోగాపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం
- విశాఖ ఆర్కే బీచ్ లో 5 లక్షల మందితో కార్యక్రమం
- యోగాంధ్ర వెబ్ సైట్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు




అమరావతి: ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని చెప్పారు. నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తామన్నారు. జూన్ 21న ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకూ 5 లక్షలమందితో కార్యక్రమం జరుగుతుందని

మిగతా.. 2లో



## బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటా

- ★ టీడీపీ కార్యకర్తలే పార్టీకి బలమన్న మంత్రి లోకేశ్
- ★ మృతిచెందిన నేత బాలకోటిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని హామీ
- ★ ఉండవల్లి నివాసంలో బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులతో లోకేశ్ భేటీ
- ★ హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- ★ ఆర్థిక సాయంతో పాటు, ఇంటి తాకట్టు విడిపిస్తానని లోకేశ్ హామీ

అమరావతి: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వారి సంక్షేమానికి తాను పెద్దన్నలా అండగా ఉంటానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడే కార్యకర్తల బాగోగులు చూడటం

మిగతా.. 2లో

## కేంద్రంపై కోర్టుకెక్కిన తమిళనాడు

ఎన్ఈపీని అమలు చేయడంలేదని నిధులు ఆపేసిందని ఆరోపణ




రాష్ట్రానికి రూ.2,151 కోట్లు విడుదల చేసేలా ఆదేశించాలని సుప్రీంలో పిటిషన్

త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం స్టాలిన్


## అదే జరిగితే రష్యాపై ఆంక్షలు విధిస్తామంటూ అమెరికా వార్నింగ్





- రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చలపై అమెరికా కీలక వ్యాఖ్యలు
- యుద్ధం ముగించకుంటే రష్యాపై అదనపు ఆంక్షలని యూఎస్ హెచ్చరిక
- సెనెట్‌లో మాట్లాడిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

## వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలి

- మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశముంది




- వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి




# రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలి

- ఉగ్రవాదంపై పోరాటం చేయడం ప్రతి భారతీయుడి దృఢ సంకల్పం
- ఉగ్రవాదాన్ని నిర్మూలించి వారికి శాశ్వత గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాం
- దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు ఏమాత్రం తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జనాన్లకు ఎప్పుడూ అండగా నిలబడుతా
- పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించింది

హైదరాబాద్: దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు ఏమాత్రం తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జనాన్లకు ఎప్పుడూ అండగా నిలబడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవలి కశ్మీర్ ఘటనల నేపథ్యంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించి వారికి శాశ్వత గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించామని చెప్పారు. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి వర్ధంతిని పురస్కరించుకుని డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ముందు ఆ మహనేత విగ్రహానికి ముఖ్యమంత్రి గారు పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ గాంధీ గారి వర్ధంతి రోజున "ఉగ్రవాద వ్యతిరేక దినం"గా పాటిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా



మిగతా.. 2లో




## అలిపిరి దాడిలో ప్రధాన సూత్రధారి కేశవరావు..

బీజాపూర్, చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు.

"నక్సలిజం నిర్మూలనలో

మిగతా.. 2లో




## కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ స్పందన

కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో కేసీఆర్ కు నోటీసులు

ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే నోటీసులని కేటీఆర్ విమర్శ

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై నాటకాలాడుతున్నాయని ధ్వజం



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన

మిగతా.. 2లో

# మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి

మొదటి పేజి తరువాయి

"నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. భద్రతా దళాలకు అభినందనలు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి: అమిత్ షా

"నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. భద్రతా దళాలకు అభినందనలు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

గణపతి తర్వాత పార్టీ పగ్గాలు

ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.

### ఎంటెక్ టు నక్సలిజం

కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్‌ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

### అలిపిరి దాడిలో ప్రధాన సూత్రధారి కేశవరావు..

మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

# యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే

మొదటి పేజి తరువాయి

భోగాపురం వరకూ 5 లక్షలమందితో కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్ సైట్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే

యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రధాని మోదీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువుకునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోదీ చేశారు. 2014 డిసెంబర్ లో యునైటెడ్ నేషనన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించి ప్రపంచమంతా యోగా దినోత్సవం జరపాలని నిర్ణయించింది. యోగా అనేది ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. మనిషి జీవితంలో మెరుగైన జీవన ప్రమాణాలకు నాంది యోగా. నేటి ఆధునిక యుగంలో అందరూ పరుగులు పెడుతున్నారు. టెక్నాలజీతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి దానికీ టెన్షన్ పడుతున్నారు. లైఫ్ మెకానికల్ గా మారుతోంది. వీటన్నంటిని నుంచి ఉపశమనం రావాలంటే యోగా ఒక్కటే మార్గం.

ఏపీ చరిత్రలో నూతన అధ్యయనం

రికార్డు సృష్టించేలా నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తాం. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షలమందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం




అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

యోగాపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం

జూన్ 21న యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నందున మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని మంత్రుల బృందం దిశానిర్దేశం చేస్తుంది. పలు యూనివర్సిటీలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థల్లోని వాలంటీర్లు, మహిళలు, వృద్ధులు, పోలీసులు, ఉద్యోగులు యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి. అలాంటివారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తాం. పట్టణాలు, నగరాల నుంచి గ్రామస్థాయి వరకూ యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధాని మోదీ ప్రపంచమంతా యోగాను ప్రమోట్ చేస్తున్నప్పుడు మనకూ బాధ్యత ఉంటుంది కదా. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా కూడా చొరవ తీసుకుని యోగాను ప్రమోట్ చేయాలి. మంచి కంటెంట్ తో ఆర్టికల్స్ రాయాలి. మంచి వీడియోస్ తయారుచేయాలి. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో అసోసియేట్ చేసుకుని 2 వేలమంది యోగా శిక్షకులను తయారుచేస్తాం. యోగా ప్రాముఖ్యత తెలిపేలా స్కూల్ సిలబస్ లో పెడతాం.

ఆరోగ్యమే మహాభాగ్యం

అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యం. మన సమస్యలకు చక్కటి పరిష్కారం యోగా. అందరూ రోజూ ఒక గంట ప్రాణాయామం, ఆసనాలు, మెడిటేషన్ చేయాలి. వీటిని ప్రాక్టీస్ చేస్తే ఒత్తిడి మాయమై పనిని ఎంజాయ్ చేస్తారు. యోగా కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా, పతంజలి, బ్రహ్మ కుమారీస్ ఇలాంటి అసోసియేషన్లు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. వీరితో నేను ఎన్నో ఏళ్లుగా అసోసియేట్ అవుతున్నారు. అప్పట్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్, ఈషా సద్గురు వాసుదేవ్ తో ఐఏఎస్ , ఐపీఎస్, మంత్రులకు నేను క్లాసులు పెట్టించాను. బ్రహ్మకుమారీస్ ప్రపంచమంతా యూనిట్లు పెట్టారు... అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఈ మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కుంకీ ఏనుగులను నేనే జాగ్రత్తగా చూసుకుంటా... ఏపీ ప్రజల కోసం వీరు హృదయాలనే తెరిచారు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పంట పొలాలు, జనావాసాలపై ఏనుగులు చేస్తున్న దాడులతో జరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, కర్ణాటక ప్రభుత్వం అందించిన ఐదు కుంకీ ఏనుగులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా స్వీకరించారు. ఈ ఏనుగుల సంరక్షణ బాధ్యతను తానే చూసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక విధానసౌధలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖాండ్రే సమక్షంలో ఈ ఐదు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కుంకీ ఏనుగులను అత్యంత జాగ్రత్తగా చూసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి గారికి, అటవీ శాఖ మంత్రి గారికి మాట ఇస్తున్నాను. వాటి సంరక్షణను నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను" అని హామీ ఇచ్చారు. గత రెండు దశాబ్దాలుగా జనావాసాల్లోకి అడవి ఏనుగులు చొరబడటం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఆస్తులు ధ్వంసమయ్యాయని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజు మనకు అందిన ఈ కుంకీ ఏనుగుల వల్ల భవిష్యత్తులో ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతాం, ఆస్తి నష్టాన్ని కూడా నివారించగలుగుతాం" అని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడం, అటవీ సంపద పరిరక్షణ వంటి పలు కీలక అంశాల్లో ఇరు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పవన్ వెల్లడించారు. "రెండు రాష్ట్రాల్లో వేర్వేరు రాజకీయ కూటములకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణ అనే ముఖ్యమైన అంశంలో సహకరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయం. వారు కేవలం ఏనుగులనే కాదు, ఆంధ్ర ప్రజల కోసం వారి హృదయాన్నే తెరిచారు" అంటూ కర్ణాటక ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కుంకీ ఏనుగులకు సంబంధించిన ధృవపత్రాలను, సంరక్షణ వివరాల డాక్యుమెంట్లను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కు అందజేశారు. ఈ కుంకీల రాకతో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు కొంత ఊరట లభించనుంది.

## కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ స్పందన

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకమని సంచలన ఆరోపణలు చేశారు. దిక్కుతోచని స్థితిలోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గత 17 నెలలుగా పరిపాలనలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కనుమరుగై, కమీషన్ల రాజ్యం నడుస్తోందని విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే స్వయంగా కమీషన్లు లేనిదే పనులు జరగడం లేదని చెబుతున్నారు. దీనిని బట్టి రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను, నల్గొండలో సుంకిశాల ప్రాజెక్టు కుప్పకూలిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం బాధితులకు సహాయం అందించడంలో, ఘటనలపై స్పందించడంలో విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. "కమీషన్ల మీద ఉన్న ఆరాటం, సహాయక చర్యలపై కూడా చూపలేకపోయారు. మృతదేహాలను వెలికితీయడానికి కూడా సాహసం చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు విషయంలో వెనక్కి తగ్గేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. "మీరు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? తులం బంగారం, నాలుగు వేల రూపాయల పింఛన్ల హామీ ఏమైంది? వీటిపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం" అని అన్నారు. చట్టాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఎప్పటికైనా న్యాయం, ధర్మమే గెలుస్తాయని, నిజాయతీ ఓడిపోదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నోటీసులు కేవలం చిల్లర ప్రయత్నాలని, దూదిపింజల్లా ఎగిరిపోతాయని కేటీఆర్ తేలిగ్గా కొట్టిపారేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, త్వరలోనే వారిని తిరస్కరించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

## రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలి

"ఉగ్రవాద వ్యతిరేక దినం"గా పాటిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు గుర్తుచేస్తూ ఉగ్రవాదంపై పోరాటం చేయడం ప్రతి భారతీయుడి దృఢ సంకల్పమని అన్నారు. కశ్మీర్ లో పర్యాటకులపై కాల్పుల ఘటన, ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించిందని, కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించామని గుర్తుచేశారు. గతంలో యుద్ధం జరిగినప్పుడు ఆనాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గారు పాకిస్తాన్ కు గుణపాఠం చెప్పారని, ఉగ్రవాదులను నిర్మూలించడంలో ఇందిరాగాంధీ గారు మనకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆ యుద్ధం సందర్భంగా ఆనాడు అమెరికా, లేదా ఇతర దేశాల మధ్యవర్తిత్వాన్ని ఇందిరా గాంధీ గారు అంగీకరించలేదని గుర్తుచేశారు. భారత దేశ భద్రతను కాపాడుకోవడంలో ఎవరి సూచనలు, మధ్యవర్తిత్వం అక్కరలేదని స్పష్టంగా చెప్పారని అన్నారు. కశ్మీర్ ఘటనలపై పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారు, మల్లికార్జున ఖర్గే గారితో పాటు అందరం కేంద్రానికి, పోరాటం చేస్తున్న వీర జవానులకు అండగా నిలబడ్డామని, ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. దేశ సమగ్రతను కాపాడటంలో మహాత్మాగాంధీ గారు, ఇందిరా గాంధీ గారు, రాజీవ్ గాంధీ గారు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు, పీవీ నరసింహారావు గారి విగ్రహాలతో ఈ ప్రాంతం భారతీయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు ఓటు హక్కు కల్పించారని, ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో 21 వ శతాబ్దంవైపు దేశాన్ని నడిపించారని గుర్తుచేసుకున్నారు. రాజీవ్ గాంధీ గారి విగ్రహానికి నివాళులర్పించిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు గారు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

## బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటా

మొదటి పేజి తరువాయి

కార్యకర్తల బాగోగులు చూడటం తన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన దివంగత టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసానికి పిలిపించి పరామర్శించారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంత్రి లోకేశ్ ను కలిసిన వెన్నా బాలకోటిరెడ్డి సతీమణి వెన్నా నాగేంద్రమ్మ, ఆయన సోదరుని కుమారులు వెన్నా నరసింహారెడ్డి, వెన్నా రామకృష్ణారెడ్డి తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాలకోటిరెడ్డి హత్య జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను వారు మంత్రికి వివరించారు. హత్య కేసులో నిందితులు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారని, కేసు విచారణను వేగవంతం చేసి, దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని వారు లోకేశ్ ను కోరారు. తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉపాధి హామీ, గృహ నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, నివాసం ఉంటున్న ఇల్లు కూడా తాకట్టులో ఉందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నారా లోకేశ్, వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల విడుదలకు కృషి చేయడంతో పాటు, పార్టీ తరపున ఇంటి తాకట్టును విడిపిస్తానని మాట ఇచ్చారు. హత్య కేసు నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో దాడులను ఎదుర్కొని నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, తోట చంద్రయ్య వంటివారే మనకు స్ఫూర్తి. మీ కుటుంబానికి ఇంటి పెద్దకొడుకుగా నేను బాధ్యత తీసుకుంటాను" అని వారికి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేశ్ తమకు అండగా నిలవడం పట్ల బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండదండలతో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇంట్లో నిద్రిస్తున్న బాలకోటిరెడ్డిని తుపాకీతో కాల్చి చంపినట్లు ఆరోపణలున్నాయి. ఈ హత్యకు ఆరు నెలల ముందు కూడా ఆయనపై కత్తులతో దాడికి విఫలయత్నం జరిగింది. తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు గతంలో తెలిపారు.

## కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

మొదటి పేజి తరువాయి

అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. 'ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు' నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరోసారి బలంగా వినిపిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే స్టీల్ ప్లాంట్ స్థాపించబడిందని, ఆ సమయంలో లాభాల బాటలో నడిచిందని వైఎస్ షర్మిల గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే "కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చిది చేయాలి" అన్న చందంగా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఇందులో భాగంగానే ఉద్యోగాలను తొలగించడం, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకు అందకుండా చేయడం, సొంత గనులు కేటాయించకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ఉద్ధరించేందుకు రూ.11 వేల కోట్లు ఇచ్చిందన్న ప్రచారం పూర్తిగా అబద్ధమని, ఇచ్చినట్లే ఇచ్చి అందులోంచి రూ.8 వేల కోట్లను బ్యాంకు రుణాల కింద వెనక్కి తీసుకున్నారని ఆమె వివరించారు. మిగిలిన రూ.3 వేల కోట్లు ఇవ్వాలంటే ఏకంగా 5 వేల మంది ఉద్యోగులను తొలగించాలని షరతు పెట్టారని, ఇది ప్లాంట్‌ను అదానీ వంటి వారికి కట్టబెట్టే కుట్రలో భాగమేనని షర్మిల ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు ఇది న్యాయంగా ఉందా అని ఆమె ప్రశ్నించారు. "ప్రధాని మోదీకి మీరు ఊడిగం చేస్తున్నారా? కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? మోదీతో లాలూచీ పడ్డారా? లేక ఈ కుట్రలో మీరూ భాగస్వాములా?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ పై ప్రధాని మోదీ ఏమన్నారంటే...!

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన భీకర ఎదురుకాల్పుల ఘటనలో 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. భద్రతా బలగాల సాహసోపేతంగా వ్యవహరించాయంటూ కొనియాడారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (70) కూడా మరణించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఇది నక్సలిజం నిర్మూలనలో ఒక మైలురాయి వంటి విజయమని ఆయన అభివర్ణించారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని అమిత్ షా తన పోస్టులో పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన పోస్టును ప్రధాని నరేంద్ర మోదీ రీపోస్ట్ చేస్తూ భద్రతా బలగాలను ప్రశంసించారు. "మీ అద్భుత విజయాన్ని చూసి గర్వపడుతున్నాను. మావోయిజం ముప్పును పూర్తిగా తొలగించి, ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని తన సందేశంలో తెలిపారు. మాధ్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. ఈ కూంబింగ్‌లో బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రె గుట్ట పర్వత ప్రాంతాల్లో 24 రోజుల పాటు సాగిన సుదీర్ఘ ఆపరేషన్‌లో 16 మంది మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. తాజా ఘటనతో మావోయిస్టుల ఏరివేత చర్యలు మరింత ముమ్మరమయ్యాయని స్పష్టమవుతోంది.

## కేంద్రంపై కోర్టుకెక్కిన తమిళనాడు

తమిళనాడు: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలు చేయడం లేదన్న కారణంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.2,151 కోట్ల నిధులను నిలిపివేసిందని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జాతీయ విద్యా విధానంలో ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని డీఎంకే ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ సూత్రం ప్రకారం, విద్యార్థులు ఇంగ్లిష్ మరియు ప్రాంతీయ భాషతో పాటు మూడో భాషను కూడా నేర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, ఇది దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నమని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తూ, ద్విభాషా విధానానికే కట్టుబడి ఉంది. ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ, భారతీయ భాషల పునరుద్ధరణకే త్రిభాషా సూత్రమని కేంద్రం చెబుతోంది. పాఠశాల విద్య కోసం ఉద్దేశించిన సమగ్ర శిక్ష పథకం అవసరాలకు అనుగుణంగా తమిళనాడు ఉందని గత ఏడాది ఫిబ్రవరి 16న జరిగిన ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిందని గుర్తుచేసింది. ఈ పథకం కింద రూ.3,585.99 కోట్ల కేటాయింపు జరిగిందని తెలిపింది. ఇందులో 60:40 నిష్పత్తి ప్రకారం, కేంద్రం వాటా రూ.2,151 కోట్లు గత ఏడాది ఏప్రిల్ 1 నుంచే రాష్ట్రానికి చెల్లించాల్సి ఉందని తెలిపింది. అయితే, ఈ మొత్తంలో ఒక్క వాయిదా కూడా కేంద్రం విడుదల చేయలేదని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. "జాతీయ విద్యా విధానం, పీఎం శ్రీ పాఠశాలల పథకాల అమలుతో సమగ్ర శిక్ష నిధుల విడుదలను కేంద్రం ముడిపెట్టడమే నిధులు విడుదల చేయకపోవడానికి స్పష్టమైన కారణం. ఈ రెండు పథకాలు వేర్వేరు" అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేలా తమపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. నిధుల నిలిపివేత సహకార సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానంలో జోక్యం చేసుకోవడమేనని డీఎంకే ప్రభుత్వం వాదించింది.

## ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ఇజ్రాయెల్ ప్లాన్!

అమెరికా-ఇరాన్: ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడులకు ఇజ్రాయెల్ సన్నద్ధమవుతోందని అమెరికా నిఘా వర్గాలు అంచనా వేస్తున్నట్లు సీఎన్ఎన్ వార్తా సంస్థ వెల్లడించింది. అమెరికా అధికారుల సమాచారం మేరకు ఈ కథనాన్ని ప్రచురించినట్లు తెలిపింది. అయితే, ఈ దాడుల విషయంలో ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకున్నారా లేదా అనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదని వెల్లడించింది. ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసే అవకాశాలు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు నిఘా వ్యవహారాలతో సంబంధమున్న ఒక అధికారి సీఎన్ఎన్‌కు చెప్పినట్లు సమాచారం. ఒకవేళ అమెరికా, ఇరాన్‌తో కుదుర్చుకునే అణు ఒప్పందం ద్వారా ఇరాన్‌లోని యురేనియం నిల్వలను పూర్తిగా నిర్మూలించలేకపోతే, దాడుల సంభావ్యత మరింత పెరుగుతుందని సదరు అధికారి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ అణు కార్యక్రమంపై దౌత్య మార్గాల్లో ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్చలు జరుపుతున్న ప్రస్తుత తరుణంలో ఈ నిఘా నివేదిక బయటకు రావడం గమనార్హం. ఇజ్రాయెల్ ఉన్నతాధికారుల ప్రకటనలు, రహస్యంగా సేకరించిన సంభాషణల రికార్డులు, సైనిక కదలికలను బట్టి ఇజ్రాయెల్ దాడులకు సిద్ధమవుతున్నట్లు అంచనా వేస్తున్నామని సీఎన్ఎన్ వివరించింది. మరోవైపు, యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మంగళవారం తీవ్రంగా తప్పుపట్టారు. కొత్త అణు ఒప్పందం కుదిరే అవకాశాలపై ఆయన అనుమానాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇరాన్‌తో అణు ఒప్పంద చర్చలు విఫలమైతే, సైనిక చర్యను కూడా పరిశీలిస్తామని అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఈ చర్చల్లో పురోగతి సాధించేందుకు ఆయన విధించిన 60 రోజుల గడువు కూడా ఇప్పటికే ముగిసిపోయింది. ఈ పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం, వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం స్పందించలేదని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది.

## ప్రధానికి అండగా ఉండాల్సిన సమయంలో కిషన్ రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారు

హైదరాబాద్: దాయాది దేశం పాకిస్థాన్‌కు తగిన రీతిలో గుణపాఠం చెప్పడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అమెరికా వంటి దేశాల ఒత్తిళ్లకు తలొగ్గి, పాకిస్థాన్ విషయంలో కీలక అవకాశాలను కేంద్రం చేజార్చుకుందని ఆయన ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే తీరులో మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో అమెరికాతో సహా పలు ప్రపంచ దేశాల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదురైనా, వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యుద్ధాన్ని కొనసాగించి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో తాము ఎలాంటి రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి ఎంతో వన్నె తెచ్చారని, భారతదేశాన్ని ఒక ఆర్థిక శక్తిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో గట్టిగా వ్యవహరించేందుకు వచ్చిన సువర్ణావకాశాన్ని కేంద్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందని ఆయన మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం దేశంలో తొలిసారిగా తామే తిరంగా ర్యాలీ నిర్వహించామని సీఎం గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో, ప్రధానమంత్రికి మద్దతుగా నిలవాల్సిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆనాడు దుప్పటి కప్పుకుని పడుకున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో పార్టీల ప్రమేయం లేకుండా, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశ ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

## అదే జరిగితే రష్యాపై ఆంక్షలు విధిస్తామంటూ అమెరికా వార్నింగ్



రష్యా-ఉక్రెయిన్: రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, శాంతి చర్చల నేపథ్యంలో అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా సుముఖత చూపకపోతే, ఆ దేశంపై మరిన్ని కఠినమైన ఆంక్షలు విధించాల్సి వస్తుందని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. సెనెట్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ మేరకు రష్యాను హెచ్చరించారు. కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో రష్యా కొన్ని నిర్దిష్ట నిబంధనలను ప్రతిపాదిస్తోందని, ఆ నిబంధనలు ఏమిటో స్పష్టత వచ్చిన తర్వాతే యుద్ధం ముగింపుపై రష్యా వైఖరి పూర్తిగా అర్థమవుతుందని రూబియో పేర్కొన్నారు. ప్రస్తుత శాంతి చర్చలు ఫలవంతమవుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అయితే, చర్చలు జరుగుతున్న సమయంలో ఆంక్షల ప్రస్తావన తీసుకురావడం దౌత్యపరమైన ప్రక్రియకు ఆటంకం కలిగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ శాంతి స్థాపనకు రష్యా ఇష్టపడకపోయినా, యుద్ధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చిచెప్పారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతిని నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నారని రూబియో తెలిపారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిపిన ఫోన్ సంభాషణ అనంతరం, ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అయితే కొన్ని షరతులు వర్తిస్తాయని వెల్లడించినట్లు సమాచారం. ఈ సంభాషణ తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, ఇరు దేశాలు తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు ప్రారంభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాత్రం, యుద్ధాన్ని ముగించే ఉద్దేశం రష్యాకు ఉన్నట్లు తనకు తోచడం లేదని వ్యాఖ్యానించారు. కాగా, ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు పాల్పడుతున్న రష్యాపై ఐరోపా సమాఖ్య (ఈయూ), బ్రిటన్ ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

## దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ భీమ్ భరత్ అన్నారు..!!

### రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన భీమ్ భరత్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : మొయినాబాద్ ( జనం రిపోర్టర్ ) : పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు మొయినాబాద్ మండల హిమాయత్ నగర్ చౌరస్తా లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరు పుకున్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పలువురు నేతలు పూల మాలలు వేసి నివాళి ఆర్పించారు...ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ



దేశానికి దిక్సూచి, ఐటీ రంగ అభివృద్ధి ప్రధాత, దేశాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి ఉగ్రమూక దాడికి బలైన రాజీవ్ జీ.నీ ఆశయం, స్ఫూర్తి మాకు, భవిష్యత్ తరాలకు ఎప్పుడూ స్ఫూర్తి దాయకమే అని చెప్పారు.....ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య , నవాబ్ పెట్ మండల అధ్యక్షులు వెంకటయ్య , షా బాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య ,చేవెళ్ళ నియోజక వర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు , మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ మరియు ఇతర అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు....

## : మురుగు కాలవలు, రోడ్లు కలిసిపోయాయి - ఈ తప్పు ఎవరిది..?



( జనం రిపోర్టర్ ) : బాజీ జంక్షన్ 90 వార్డ్ గోపాలపట్నం స్మశానం జంక్షన్ నుండి ఎన్ఏడి వరకు రోడ్లు కాలువలు కలిసిపోయాయి, దీనికి కారణం మున్సిపాలిటీ శానిటేషన్ విభాగం నిద్ర మత్తుకు కారణం అని ప్రజలు ఆరోపణలు వినిపిస్తున్నారు, ఈ ప్రాంతాన్ని చూసినవారు చెప్పేది ఒకటే శానిటేషన్ విభాగం ముందు చూపు లేకపోవడం, కాలువలు శుభ్రం చేయకపోవడం, ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం కట్టిన



కాలువలు చిన్నవి కావడం, కార్పొరేటర్లు వస్తారు, వారి సమయం పూర్తయిపోయి వెళ్ళిపోతారు, కానీ జీవీఎంసీ అధికారులు ఉంటారు కానీ నెల నెల జీతం కోసమే వస్తున్నారు, అని ఆరోపణలు, జీవీఎంసీ శానిటేషన్ విభాగం కళ్ళు తెరిచి ఇలాంటి సమస్య ముందు ముందు తలెత్తకుండా కాలువలు శుభ్రం చేయడంలో మీ సేవలు అందించాలని, సిబ్బంది ఎక్కువ- పని తక్కువ అనే సాంప్రదాయాన్ని దగ్గరికి చేరనివ్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు..

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగిన మానస- రాజేష్ ల కళ్యాణ మహోత్సవం....

### నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆధ్వర్యంలో.. తలపెట్టిన మానస- రాజేష్ ల కళ్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. తబిత బాలల సంరక్షణ సంస్థ పుత్రిక చి.ల.సౌ. యన్.మానస, రేణుక యాకయ్య గార్ల ఏకైక పుత్రుడు యమ్. రాజేష్ కళ్యాణం, బుధవారం ఉదయం 11:05 నిమిషాల సుముహూర్తం నాడు ఘనంగా జరిగింది. ఈ వివాహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్ డి.వేణు టి ఎన్ జి ఓ అధ్యక్షులు బొంకురి శంకర్ .జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు, బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నేడు పెళ్లి చేసుకుంటున్నా నూతన వధూవరుల కోసం జిల్లాలోని టీఎన్జీవో సంఘం సేకరించిన 61 వేల 800 రూపాయల చెక్కును కలెక్టర్ అందించారు.

# షెడ్యూల్డ్ “కులానికా లేక హిందూ “మతానికా



పెదకాకాని దుగ్గిరాల ( జనం రిపోర్టర్ ) : మతం .... నమ్మకం విశ్వాసం కులం ....... నిజం వాస్తవం కులం పుట్టుక వాస్తవం నిజంఆధారంగానే ప్రాతిపదికఁ (ఎస్సీ) రిజర్వేషన్లు మతం (విశ్వాసం/నమ్మకం) ఆధారంగా కాదు మతం మారితే కులం మారుతుందా ?! ఎస్సీలు ...హిందూ మతం నుండి క్రైస్తవ మతంలోకి మారితే రిజర్వేషన్లు వర్తించవా ?!బీ ఎస్సీ హోదా రద్దవుతుందా ?!ఇది అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం మత స్వేచ్ఛ కలిగిన లౌకిక భారత దేశంలో...మతానికి సంబంధం లేకుండా కేవలం కులం ఆధారంగానే ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు అయ్యేవిధంగా రాజ్యాంగ / న్యాయ సమీక్ష చేయాలి ప్రభుత్వం జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రంలో “మత ప్రస్తావన” తొలగించాలి ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ సుప్రీం కోర్టుకు లేఖ మన భారత దేశ అంబేద్కర్ రాజ్యాంగం సామాజిక మరియు రాజకీయ రెండు రంగాలలోనూ సమానత్వం మరియు న్యాయం అనే మహోన్నత ఆదర్శాలను అంగీకరిస్తుంది. ఈ క్రమంలో సమాజంలో మతం, తెగ లేక జన్మ స్థలం ఆధారంగా ఏ వర్గానికి చెందిన ప్రజల మీద వివక్షను రాజ్యాంగం నిర్మూలిస్తుంది. సదరు ఆదర్శాల సాధనకు కుల ప్రాతినిధ్యం, లేక చట్ట సభల్లో లేక ఏదేని ప్రభుత్వ కార్యాలయాల్లో మతం ఆధారంగా రిజర్వేషన్లను భారత రాజ్యాంగం నిర్మూలిస్తుంది. కానీ భారత ప్రజాస్వామ్య పురోగమనానికి సామాజికంగా మరియు ఆర్థికంగా వికలాంగులైన వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు / అవకాశాలు కల్పించక పోతే భవిష్యత్ లో భారత ప్రజాస్వామ్య పురోగమనం సాధ్యం కాదు అని రాజ్యాంగ నిర్మాత భావిస్తారు. ప్రజాస్వామ్య సమానత్వం క్రియాశీలతనొందాలంటే ప్రత్యక్షంగా జాతి యావత్తూ ఒకే స్థాయిలోకి తీసుకురాబడాలి. కాబట్టి మిగిలిన జాతితో సమాన స్థాయికి సదరు బలహీన వర్గాలను తీసుకురావడానికి నిర్దిష్ట తాత్కాలిక సదుపాయాలు / అవకాశాలు మరియు నాగరిక, భాషా మరియు సారూప్య నిర్దిష్ట రక్షణలను రాజ్యాంగం కల్పిస్తుంది. ఆదేశ సూత్రాలు ఆర్టికల్ 46 సమాజంలో బలహీన వర్గాలను ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలను విద్యా మరియు ఆర్థిక రంగాలలో ముందుకు తీసుకుపోవడానికి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపడానికి రాజ్యానికి/ ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్నది. రాజ్యాంగం పార్ట్ 3 సదరు వర్గాల రక్షణకు నిర్దిష్ట ప్రాథమిక హక్కులను కల్పిస్తుంది. ఆర్టికల్ 14, ఏ వ్యక్తికి చట్టం ముందు సమానత్వాన్ని నిరోధించకుండా ఉండే హక్కు, ఆర్టికల్ 15, ప్రభుత్వ రంగానికి సంబంధించి మతం, తెగ, కులం మొ. ఆధారంగా రాజ్యం/ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడాన్ని నిర్మూలిస్తుంది. ఆర్టికల్ 16 ప్రభుత్వ రంగాల్లో అందరికి సమాన అవకాశాలు కల్పిస్తున్నది. ఆర్టికల్ 17, అంటరానితనాన్ని నిర్మూలిస్తుంది.

### ఎవరు ఎస్సీ :

భారత సమాజంలో నిమ్న కులానికి/ జాతికి చెందిన వారు. అంటరాని కులం మరియు బాగా వెనుకబడిన అణగారిన కులం.

ఎవరు / ఏ వ్యక్తులు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారో రాజ్యాంగ నిర్వచించకపోయినప్పటికి ఆర్టికల్ 341, షెడ్యూల్డ్ కులాల లిస్ట్ తయారు చేయడానికి భారత రాష్ట్రపతికి అవకాశం కల్పిస్తున్నది. ఆర్టికల్ 341 ప్రకారం భారత రాష్ట్రపతి ఆయా రాష్ట్రాల గవర్నర్ లను సంప్రదించాక షెడ్యూల్డ్ కులాలను లేక షెడ్యూల్డ్ కులాల్లో గ్రూపులను స్పెసిఫై చేయడానికి లేక నోటిఫికేషన్ విడుదల చేయడానికి భారత రాష్ట్రపతికి అవకాశం కల్పిస్తున్నది. ఆర్టికల్ 330- 342 షెడ్యూల్డ్ కులాల షెడ్యూల్డ్ తెగల రక్షణకు ప్రత్యేక అవకాశాలు

### / సదుపాయాలు కల్పించడానికి రాజ్యానికి / ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్నది.

ఆర్టికల్ 25 - 28 ప్రజలకు/ పౌరులకు మత స్వేచ్ఛను కల్పిస్తున్నది. భారత రాజ్యాంగం లోని రాజ్యాంగ పీఠికలో నిబిడీకృతమైన లౌకిక భావన... ఆలోచన, విశ్వాసం, విధేయత మరియు ఆరాధన లలో ప్రజలకు / పౌరులకు స్వేచ్ఛను కల్పిస్తున్నది.

కానీ నేటి సమకాలీన సమాజంలో ఎస్సిలందరూ హిందూ మతానికి చెందిన వారేనని వారి పూర్వపు హిందూ మతాన్ని త్యజించి క్రైస్తవ మతం లేక మరేదైనా మతం లోకి మారితే వారు %ూజ% రిజర్వేషన్లు కోల్పోతారని, %ూజ% హోదా రద్దవుతుందని మరియు %ూజ ూ% అత్యాచార నిరోధక చట్టం ప్రయోజనాలు పొందజాలరనే భావన పేద వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది మరియు సదరు భావనను ఖండిస్తున్నాం. మతం మారినంత మాత్రాన కులం ఎలా మారుతుందో అది ఏ రాజ్యాంగ నీతి అని సూటిగా ప్రశ్నిస్తున్నాం. అసలీ దేశంలో రిజర్వేషన్లు కులం ఆధారంగా ఇవ్వబడ్డవా లేక మతం ఆధారంగా ఇవ్వబడ్డవా అని నిలదీస్తున్నాం. అసలు ఒక వ్యక్తి/ పౌరుడు తనదే కులం అని చెప్పడానికి తన మతాన్ని కూడా చెప్పవలసిన అగత్యం ఎందుకు? ఇది అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.లౌకిక భారత దేశం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పిస్తున్నది. అవధులు లేని మత స్వేచ్ఛ కూడా సమాజంలో మత ఆందోళనలకు / అలజడులకు దారి తీస్తుంది. సదరు సామాజిక రుగ్మతలను నియంత్రించడానికి లేదా నిర్మూలించడానికి రాజ్యం/ ప్రభుత్వం నిర్దిష్ట కఠిన చర్యలు తీసుకోవాలి. కాబట్టి రాజ్యాంగ హక్కులు పొందడానికిబ్కులం ఆధారంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ రిజర్వేషన్లలో మత ప్రస్తావన అసలు అవసరం లేదని మేము భావిస్తున్నాము. పేదరికం, అంటరానితనం, అస్పృశ్యత మొ ప్రామాణికంగా / కొలమానంగా ఒక నిబంధన / షెడ్యూల్ కింద చేర్చబడిన కులాలు ... షెడ్యూల్డ్ కులాలు. భారత దేశ అత్యున్నత న్యాయస్థానం కుల- మత వివాదం పై రాజ్యాంగ / న్యాయ సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. తద్వారా ఎస్సీ లోని అన్ని కులాలు మత ప్రస్తావన అవసరం లేకుండా ఎస్సీ హోదా పొందు విధంగా మరియు ఎస్సీ ఎస్టీ నిరోధక చట్టం కింద రక్షణ పొందే విధంగా అవకాశం కల్పించాలని మరియు భవిష్యత్ లో సదరు కులాలకు ప్రభుత్వం జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రాలలో అసలు మత ప్రస్తావన తొలగించవలసినదిగా సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాం.దివ్య చిత్తమునకు తేవాలయిను. చిలువూరు నాగ రాజు మాదిగ న్యాయవాది ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్

# కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు...

### నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ మహానాడులో మంత్రి అనగాని సత్యప్రససాద్

రేపల్లె ( జనం రిపోర్టర్ ) : కార్యకర్తలే నా కుటుంబ సభ్యులని, వారికి మించిన ఆత్మీయులు తనకు ఎవరూ లేరని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్లో బుధవారం నియోజకవర్గ స్థాయి మహానాడు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారని కొనియాడారు.టిడిపి కార్యకర్తలకు, నాయకులకు మహానాడు పెద్ద పండుగ అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్క కార్యకర్త చైతన్యవంతులు కావాలని కోరారు. గత ఐదు సంవత్సరాలు రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నరని గుర్తుచేశారు. సమయం చూసి ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడి అద్భుతమైన మెజారిటీని ఇచ్చారని చెప్పారు. గత పాలకులు అప్పులు చేసి జేబులు నింపుకున్నారు, తప్ప సామాన్య ప్రజలకు ఏమాత్రం మేలు చేసే కార్యక్రమాలు చేయలేదని విమర్శించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే అమరావతి రాజధాని నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. జూన్ నెలలో తల్లికి వందనం, రైతన్నలకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలు అమలు చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. సూపర్ సిక్స్ తో పాటు మరికొన్ని పథకాలను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. గత పాలకులు రెవిన్యూ భూముల విషయంలో అనేక చిక్కుముడులు వేశారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములతో పాటు అటవీ భూములను పెద్ద ఎత్తున ఆక్రమించారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసే దిశగా ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. రాక్షస పాలనలో ప్రతి రంగాన్ని నిర్వీర్యం చేశారని వాటన్నింటిని సరిదిద్ది పునర్నిర్మాణం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చున్నారు. చంద్రబాబు పాలనలో భవిష్యత్తుపై నమ్మకంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, కార్యకర్తలు కూడా సంతోషంగా ఉండేలా చూస్తాం అన్నారు. పార్టీ కార్యకర్తలంతా కష్టకాలంలో పార్టీకి రక్షణకవచంలా నిలిచారని వారు అందించిన సహకారం వెలకట్టలేనిది అన్నారు. గ్రామాలలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే దిశగా అభివృద్ధి పై సమీష్టంగా కృషి చేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు.మన గ్రామాన్ని, మన నియోజకవర్గాన్ని అద్భుతమైన అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. నిజాంపట్నం.. గుంటూరు నాలుగు లైన్ల రహదారి మంజరు చేయడంతో పాటు 214ఏ జాతీయ రహదారి నాలుగు లైన్లుగా మార్చడంలో తన వంతు కృషి చేశానన్నారు. రేపల్లె.. తెనాలి రైల్వే లైన్ డబల్ లైన్ గా మార్చేందుకు, రేపల్లె నుండి బాపట్ల నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలిగల రాజశేఖర్ బాబు, మంత్రి సోదరులు శివప్రసాద్, కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధర్ రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జీవి నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, మంత్రి వ్యక్తిగత సహాయకులు

ధర్మ తేజ, మీడియా కోఆర్డినేటర్ వేమూరి అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి....

### జూన్ 2 నాటికి రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు.....

### కాల్వ మరమ్మత్తు, చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలి....-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...






రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. గ్రామీణ అభివృద్ధిలో ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామీణాభివృద్ధి శాఖ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని, అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద కూలీల సంఖ్య పెంచెందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చిన్న నీటిపారుదలు, లిఫ్ట్ ఇరిగేషన్, చెరువులు, ఎస్సారెస్పీ క్రింద ఉన్న వివిధ కాల్వల్లో మరమ్మత్తు పనులు గుర్తించి చేపట్టాలని, కాలువలలో నీటి ప్రవాహకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తిస్థాయిలో సిల్ట్, చెత్త , పిచ్చి మొక్కలు తొలగింపు వంటి పనులు ఉపాధి హామీ క్రింద చేపట్టాలని కలెక్టర్ సూచించారు.యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లబ్ధిదారులకు జూన్ రెండు నాటికి స్వయం ఉపాధి యూనిట్ మంజూరు పత్రం పంపిణీ చేసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పారదర్శకంగా అర్హుల జాబితా ఎంపిక చేయాలని, జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో తుది జాబితా తయారు చేయాలని అన్నారు. స్వయం ఉపాధి యూనిట్ గ్రౌండింగ్ కు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, ఎంపిడిఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలు పోతున్నా కూడా పట్టించుకోని అధికారులు.




గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు పట్టణం నెహ్రూ నగర్ ఒకటవ లైను మహాలక్ష్మమ్మ అమ్మవారి గుడి వాటర్ ప్లాంట్ దగ్గర కన్స్ట్రక్షన్ జరుగుతున్న ఒక నాలుగు అంతస్తుల బిల్డింగ్ వద్ద నడిరోడ్డు మీద లారీ ఇసుక పోయడం వలన వాహనదారులు రాకపోకల సమయం నందు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొంతమంది రాత్రి సమయాలలో ఇది గమనించక బండి మీద నుంచి కిందపడి తీవ్ర గాయాల పాల అవుతున్నారు. మరి కొంతమంది ఇక్కడ గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలా ఇసుకపోయడం వలన భారీ గా ట్రాఫిక్ కు ఇబ్బంది గా ఉంటుంది. గత కొన్ని రోజులు నుండి వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు కాలవలోకి వెళ్లకుండా ఈ ఇసుక అడ్డగించుటవలన మురుగునీరు నడిరోడ్డు మీద నిలుస్తుంది. గత పది రోజుల నుండి ఈ విషయము పైన ట్రాఫిక్ పోలీస్ శాఖ వారికి మరియు మునిసిపల్ శాఖ వారికి కొంతమంది వాహనదారులు కంప్లైంట్ ఇవ్వగా ఈ శాఖల వారు ఈ విషయం పైన పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించుట వలన వాహనదారులు ఈ శాఖల పైన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## నకిలీ విత్తనాలు అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు...

రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో సహాయ వ్యవసాయ సంచాలకులు పెద్దపల్లి ,విత్తన ధ్రువీకరణ అధికారి కరీంనగర్, పోలీస్ అధికారి కమాన్పూర్ లతో విత్తన తనిఖీ కొరకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. వీరు నిరంతరం 24/7 అందుబాటులో ఉంటారు రైతులు ఎవరైనా బిజీ పత్తి విత్తనాలు, ఎచ్ టి పత్తి విత్తనాలు రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరిగి అమ్మే విత్తనాల గురించి సమాచారం తెలిస్తే ఈ క్రింది అధికారులకు సమాచారం అందించి గలరు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడును, నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎవరైనా తమకు తెలిసిన సమాచారం ఉంటే అందించి రైతు సంక్షేమానికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము.టాస్క్ ఫోర్స్ కమిటీ..1.వ్యవసాయ శాఖ:శ్రీ ఎం శ్రీనాథ్ సహాయవ్యవసాయ సంచాలకులు, పెద్దపల్లి ,సెల్ నెంబర్.8977752820 2. విత్తన ధ్రువీకరణ సంస్థ: శ్రీ వై సునీల్ విత్తన ధ్రువీకరణ అధికారి, కరీంనగర్, సెల్ నెంబర్ 7288879682,7799011929.3. పోలీస్ శాఖ: శ్రీమతి జె రవళి పోలీస్ఆఫ్ కమాన్పూర్ సెల్ నెంబర్:9550279233, 8712575504. యొక్క నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

## సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొన్న పోలేపల్లి నాగలక్ష్మి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : గత నెల ఏప్రిల్ 30 నుండి మే 3 వరకు నెల్లూరు లోని విక్రమ సింహపురి యూనివర్సిటీ లో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టు పాల్గొనడం జరిగింది. ఈ జట్టులో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65 వ డివిజన్ లోని దేవన్నపేట కు చెందిన పోలేపల్లి నాగలక్ష్మి, తండ్రి (పోలేపల్లి రాజు) పాల్గొని మంచి ప్రతిభ కనబరచినందుకు మరియు వారి తల్లి దండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు గ్రామ పెద్దలు క్రీడాకారిణి నాగలక్ష్మిని మరియు కోచ్ నీ అభినందించి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడలలో పాల్గొని మంచి విజయాలను సాధించాలన్నారు. వీరిలో పంజాల భూపాల్ గౌడ్, అయ్యాల సాంబరెడ్డి, రాజు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ సేవలోనే తృప్తి ఆనందం చకిలం రాజేశ్వరరావు




హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి నిండు వేసవిలో, మండు టెండల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చి పోయే బాటసారులకు చల్లని మజ్జిగ, చల్లని నీరు అందిచడంలో ఎంతో తృప్తి, ఆనందం ఉందని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చకిలం. రాజేశ్వరరావు అన్నారు. హనుమకొండ




జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యములో నగరంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో దాతలు రోజుకొకరు ముందుకొచ్చి మజ్జిగ, మంచినీరు అందిచడం అభినందనీయమన్నారు.మా తల్లిదండ్రులు స్వర్గీయ చకిలం. జయలక్ష్మి సూరయ్య దంపతుల జ్ఞాపకార్థం ఈ రోజు మజ్జిగ, మంచినీరు 300 మందికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ.మోహన్ రావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు పబ్బతి. నాగభూషణం, చిదర. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైరాన్ లో పల్లిసిఐటియు హమాలి యూనియన్ కమిటీ ఎన్నిక





**హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి మండలం బైరాన్ పల్లి గ్రామంలో ఆల్ అమాలి వర్కర్స్ యూనియన్ సిఐటియు గ్రామ కమిటీని ఈరోజు ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీకి ముఖ్యఅతిథిగా పాల్గొని సిఐటియు మండల కార్యదర్శి పుల్ల అశోక్ మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యలను పాలకులు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు హమాలీలు పనిచేసే ఎగుమతి దిగుమతుల సందర్భంగా ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్న వీరి సంక్షేమానికి నయా పైసా ఖర్చు చేయడం లేదని ఆయన అన్నారు. ఇందిరమ్మ పథకం కింద వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. 50 వయసు పైబడిన వారికి తొమ్మిది వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని అశోక్ పిలుపునిచ్చారు. నూతన కమిటీకి అధ్యక్షులుగా జక్కుల స్వామి, ఉపాధ్యక్షుడు కాగితాల నరసింహ స్వామి, జక్కుల ఓదెలు, జక్కుల రఘుపతి, జక్కుల కుమార్, మేకల దీకొండ సదానందం, కళ్ళబోయిన దేవేందర్, బొంతాల రాజకుమార్,బొంతల రవి,కార్మికులు ఏకగ్రీవ ఎన్నికయ్యారు**

## కిట్స్ వరంగల్ మ్యాథ్‌వర్క్స్ క్రెడెన్షియలైజేషన్ విజయవంతం




హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, వరంగల్ కిట్స్ డబ్ల్యు యొక్క మ్యాథ్‌వర్క్స్ క్రెడెన్షియలైజేషన్ సాధించారు.మ్యాథ్‌వర్క్ సాధనాలను ఎక్కువగా ఉపయోగించినందుకు ఈఈ ఈ మరియు ఈసిఈ విభాగాలకు మ్యాథ్‌వర్క్స్ ప్రశంసా పత్రాన్ని కూడా అందజేసింది.ఇది విద్యార్థుల ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దారి తీస్తుంది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, సీనియర్ ఎగ్జిక్యూటివ్, శ్రీమతి జాహిదా వసీమ్, సేల్స్ మేనేజర్ సౌత్ ఎడ్యుకేషన్, మ్యాథ్‌వర్క్స్ ఇన్ వారు కిట్స్ వరంగల్‌కు గుర్తింపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. "క్యాంపస్-వైడ్ లైసెన్స్ యొక్క క్రెడెన్షియలింగ్ అనేది భారతదేశంలోని ప్రస్తుత క్యాంపస్-వైడ్ లైసెన్స్ సంస్థలు లేదా విశ్వవిద్యాలయాలకు ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న బ్రాండింగ్ ఫ్రేమ్‌వర్క్ భౌతిక సూచిక అని కూడా ఆయన పేర్కొన్నారు. క్యాంపస్-వైడ్ లైసెన్స్ కస్టమర్‌లు క్రెడెన్షియల్ పొందడానికి కనీస ప్రమాణాలు లేదా బెంచ్‌మార్క్‌ను తీర్చాలి. క్రెడెన్షియల్ పొందిన విశ్వవిద్యాలయాలు మరియు సంస్థలు ఎంపిక చేసిన క్యాంపస్‌ల లీగ్‌లో భాగమవుతాయి. కిట్స్ వరంగల్‌లో అధ్యాపకులు మరియు విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి మరియు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి మ్యాట్ ల్యాబ్ మరియు సిములింక్ సాఫ్ట్‌వేర్‌లను విస్తృతంగా ఉపయోగిస్తున్నందున దీనికి గుర్తింపు లభిన్చిది. గుర్తింపు పొందిన సంస్థల విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలతో ముందంజలో ఉన్నారు అని సగర్వంగా తెలిపారు.ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, రాజ్య సభ ఎం.పి., కిట్స్ వరంగల్ కార్యదర్శి కరస్పాండెంట్ కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి.నారాయణ రెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే మరియు కిట్స్ అడిషనల్ సెక్రెటరీ, శ్రీ వి. సతీష్ కుమార్, మ్యాథ్‌వర్క్స్ క్రెడెన్షియలైజేషన్ సాధించినందుకు కిట్స్ వరంగల్ యొక్క అధ్యాపకుల మరియు విద్యార్థుల బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా, శ్రీ రమణ అంచూరి,సీనియర్ ఇంజనీర్ ఎడ్యుకేషన్ టీం,మ్యాథ్‌వర్క్స్ ఇన్‌బీ శ్రీమతి మోనికా నమ్మి టెరిటరీ మేనేజర్,ఎడ్యుకేషన్ ఏపీ తెలంగాణ ఈసిఈ విభాగం హెడ్, ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర రెడ్డి, ఈ ఈ ఈ విభాగం హెడ్, ప్రొఫెసర్ జి. రాజేందర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ పి.ఆర్.ఓ డా. డి. ప్రభాకరా చారి, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్...





రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, నవ భారత నిర్మాతగా పేరుగాంచిన స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఘనంగా నివాళులు అర్పించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న మహానేత విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తూ, ఆయన సేవలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , జీహెచ్ఎంసీ మేయర్, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు కూడా పాల్గొని, భారతదేశం కోసం రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయనను నవ భారత యువతకు స్ఫూర్తి ప్రదాతగా అభివర్ణించారు.ఈ రోజు "అంతర్రాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా దేశమంతటా రాజీవ్ గాంధీ గారి ఆలోచనలు, దేశభక్తిని స్మరించుకోవడం గర్వకారణంగా నిలుస్తోంది.

## నగర పాలక సంస్థ, గుంటూరు





గుంటూరు ( జనం రిపోర్టర్ ) : నగరంలోని 3 వంతెనల దగ్గర డ్రైనేజి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర గారు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి 3 వంతెనల దగ్గర పర్యటించి వర్షపు నీరు నిలబడకుండా తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, శంకర్ విలాస్ ఆర్.ఓ.బి తరువాత గుంటూరు పశ్చిమ మరియు తూర్పు నియోజకవర్గాలకు అతి ముఖ్యమైన వారధిగా 3 వంతెనల మార్గం ఉందని, త్వరలో ఆర్.ఓ.బి పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ మళ్లింపుకు కూడా ఇదే మార్గం అవుతుందన్నారు. అటువంటి కీలకమైన ప్రాంతంలో రోడ్ల విస్తరణకు స్థల సేకరణ కూడా చేయడం జరిగిందన్నారు. కాని చిన్నపాటి వర్షానికి కూడా ఈ ప్రాంతం బురదతో మునుగుట వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం మురుగు నిలవకుండా డ్రైన్ నిర్మాణం చేయాలని, స్థల సేకరణ జరిగిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అవుట్ ఫాల్ డ్రైన్ వెంట్ కూడా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న డ్రైన్లు మరియు కల్వర్టుల వద్ద సిల్ట్ ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సదరు పర్యటనలో యస్.ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఈ.ఈ సుందరరామిరెడ్డి, డి.ఈ.ఈ లు హనీఫ్, నాగభూషణం ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మామిడి కాయ పచ్చడి విషయంలో గొడవ,భార్యను గొంతు నులిపి చంపిన భర్త....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. (పెద్దపల్లి) కాల్వశ్రీరాంపూర్ మామిడికాయ పచ్చడి పెట్టె విషయంలో తలెత్తిన గొడవలో భార్యను గొంతు నులిపి చంపాడు భర్త, ఈ ఘటన పందిళ్ల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సూర అంజలి- సూర రాజ్‌కుమార్ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మామిడికాయ పచ్చడి పెట్టేందుకు అంజలి సన్నద్ధమైంది. అవసరమైన వెల్లుల్లి కొనుక్కు రావాలని భర్త రాజ్ కుమార్ సూచించింది.ఈ విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన రాజ్ కుమార్.. అంజలి(27)ను గొంతు నులిమి చంపేశాడు. ఈమెరకు మృతురాలి తండ్రి సంపంగి మల్లేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శవాన్ని పరిశీలించిన పోలీసులు ఆసుపత్రికి చికిత్స. మృతురాలి భర్త రాజ్ కుమార్ పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి బాధాకరం... దండెం రాంరెడ్డి



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, ఎల్బీనగర్, మే 21: ( జనం రిపోర్టర్ ) : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, కుంట్లూరు గ్రామానికి చెందిన యువకులు పిన్నింటి చంద్రసేనా రెడ్డి, చుంచు త్రినాథ్ రెడ్డి, చుంచు వర్షిత్ రెడ్డి లు బుధవారం తెల్లవారు జామున కుంట్లూరు పసుమాముల రోడ్డులో జరిగిన గోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ దండెం రాంరెడ్డి, ఆ యువకుల నివాసాలకు వెళ్లి వారి పార్థివ దేహాలను సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి, ఆ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## పెద్ద చెరువులోకి డ్రైనేజ్ మురికి నీళ్లు రాకుండా పనులు ప్రారంభించడం జరిగింది



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, ఎల్బీనగర్, మే 21 : ( జనం రిపోర్టర్ ) : వనస్థలిపురం, చింతలకుంట వివిధ ప్రాంతాల నుండి మన్సూరాబాద్ పెద్ద చెరువులోకి వస్తున్న డ్రైనేజ్ వాటర్ ని అరికట్టేందుకు, పెద్ద చెరువులో కలుషిత నీరు కలవకుండా ఉండేందుకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి గత వారం రోజులు క్రితం భారీగా వచ్చిన అకాల వర్షం కారణంగా చెరువులోకి వస్తున్న డ్రైనేజీ వాటర్ ను వెంటనే ఆపాలని జిహెచ్ఎంసి అధికారులకు తెలియజేయడంతో పనులు కార్పొరేటర్ విజ్ఞప్తి, అదేవిధంగా స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఈరోజు పనులును ప్రారంభించడం జరిగింది. ఇట్టి పనులను స్వయంగా మేము వెళ్లి పర్యవేక్షించడం జరిగింది..జరుగుతున్న పనులను జలమండలి అధికారి ప్రేమ్ ,బీజేపీ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి ,పాతూరి శ్రీధర్ గౌడ్, శేఖర్ అక్కడ కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది..

## రామగుండం పోలీస్ కమిషనరేట్ కు గౌరవప్రదమైన గుర్తింపు....


TELANGANA POLICE

Appreciation

C. No. 947/B2/CID-TG/2025 Dated: 21.05.2025

The Ramagundam Commissionerate is here by awarded this Certificate of Appreciation for receiving the 3rd highest positive feedback score among the total feedback received from the citizens on Police services through the QR code & CFC. Their dedicated service to the community has been invaluable and has enabled the Police to improve Citizen Services.

Smt. Shikha Goel, IPS., Director General, CID, Telangana, Hyderabad.

Dr. Jitender, IPS., Director General of Police, Telangana, Hyderabad.

రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 21. రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్, సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా, యూనిట్ ల వారిగా టాప్ 10 ఎంపికలో రామగుండం పోలీస్ కమీషనరేట్ కు మూడవ స్థానం....రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్, సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా పోలీస్ స్టేషన్ ల వారిగా టాప్ 10 ఎంపిక లో అంతర్గం పోలీస్ స్టేషన్ కు మూడవ స్థానం.ప్రజలకు, బాధితులకు మెరుగైన సేవలను అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ పోలీస్ శాఖ గురించి, స్టేషన్లలోని సిబ్బంది గురించి ప్రజలేమనుకుంటున్నారు...? పోలీస్ స్టేషన్లలో ప్రజలకు సరైన ఆదరణ, సేవలు లభిస్తున్నాయా, ఫిర్యాదుదారులతో సిబ్బంది ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు...? అనే విషయాలు తెలుసుకోవడం కోసం ఓ క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. క్యూఆర్ కోడ్, సి ఎఫ్ సి ద్వారా పోలీసు సేవలపై ప్రజల నుండి వచ్చిన మొత్తం అభిప్రాయాల ఆధారంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిజిపి ఆదేశాల మేరకు టాప్ 10 యూనిట్ లను ఎంపిక చేయడం జరిగింది. అందులో యూనిట్ ల వారిగా రామగుండం పోలీస్ కమీషనరేట్ మూడవ స్థానం సాధించడం జరిగింది. అదేవిదంగా రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్, సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా పోలీస్ స్టేషన్ ల వారిగా టాప్ 10 ఎంపికలో పెద్దపల్లి జోన్ అంతర్గం పోలీస్ స్టేషన్ మూడవ స్థానం సాధించడం జరిగింది. ఇట్టి అవార్డు లను డిజిపి జితేందర్ చేతుల మీదుగా కమీషనరేట్ తరుపున మంచిర్యాల డీసీపీ భాస్కర్, అంతర్గం ఎస్ఐ వెంకట్ లు అందుకోవడం జరిగింది. సమాజానికి వారు వారి అంకితభావంతో కూడిన అమూల్యమైన సేవ అందిచడం, పోలీసులు ప్రజలకు సేవలను మెరుగుపరచడానికి వీలు కల్పించింది అని, రాష్ట్ర వ్యాప్తంగా ఇట్టి గుర్తింపు పొందడానికి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పోలీస్ మీకోసమే ఉన్నదనే భరోసా నమ్మకం కల్పిస్తూ, విధులు నిర్వహిస్తూన్న పోలీస్ అధికారులను, సిబ్బంది నీ రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్ రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద, సోషల్ మీడియా, పోలీస్ వెబ్‌సైట్లల్లో అందుబాటులో ఉంటుందని క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేస్తే అందులో పోలీసుల పనితీరు గురించి ప్రశ్నలు ఉంటాయని,వాటికి సమాధానాలు టైప్ చేసి పంపాలని లేదా వాయిస్ ద్వారా అయినా సమాధానం పంపవచ్చు అని, అదే విధంగా



ఎఫ్ఐఆర్ గురించి, ఈ చలాన్ (ట్రాఫిక్ ఉల్లంఘనలు), పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని సీపీ తెలిపారు. ప్రస్తుత పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయాలు విశ్లేషించి వాటి ఆధారంగా పోలీస్ సేవల ప్రమాణాలు మెరుగుపర్చుకొని, తద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యమని కావున ప్రజలు తమ అభిప్రాయంలను, సలహాలు, సూచనలు తెలపగలరు అని ఈ సందర్భంగా సీపీ సూచించారు.

## అమరచింత ఆత్మకూరు పట్టణాలకు వరాల జల్లు కురిపించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్





అమరచింత /ఆత్మకూరు/ వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : అమరచింత, ఆత్మకూరు మండలాలలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మక్తల్ నియోజకవర్గం లోని అమరచింత, ఆత్మకూరు మండల కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి పర్యటించారు. మొదట ఆయన అమరచింత పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో స్థానిక నాయకులు టిపిసిసి కల్లుగీత డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ నాగరాజు గౌడ్ తో కలిసి పరిశీలించారు. అమరచింతలో ఇండోర్ స్టేడియం నిర్మించుకుంటామని అడిగిన వెంటనే ఆయన కోటి రూపాయలు మంజూరు చేశారు. అనంతరం ఆత్మకూరు జాతర మైదానంలో చైర్మన్ స్థానిక నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్ తో కలిసి మినీ స్టేడియం కొరకు స్థల పరిశీలన చేశారు. అనంతరం ఒక కోటి 80 లక్షల రూపాయలను మినీ స్టేడియం నిర్మించుకునేందుకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో క్రీడల పట్ల యువకులు ఆసక్తి కనబరుస్తారని ప్రో కబడ్డీ లో ఆత్మకూరు, అమరచింత మండలాలు చెందిన యువకులు ఎన్నికయ్యారని ఎమ్మెల్యే వాకిడ్ శ్రీహరి చైర్మన్ కు తెలిపారు. చైర్మన్ శివసేన రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల కోసం ఎంతైనా ఖర్చు చేస్తామని ఇక్కడ క్రీడల పట్ల ఎంతో ఆసక్తి ఉందని యువకులు మరింత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుబ్ ఖాన్ అమరచింత ఆత్మకూర్ మండలాల అధ్యక్షులు కేజీ మహేందర్రెడ్డి పరమేష్ పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు అరుణ్ కుమార్ మక్తల్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తులసీరాజ్ మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా యాదవ్ అమరచింత ఆత్మకూరు మండలాల సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



అమరచింత /వనపర్తి జిల్లా ప్రతినిధి/ ( జనం రిపోర్టర్ ) : అమరచింత మండలంలో నేడు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అమరచింతతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 132/33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మరమ్మతుల అనంతరం నాలుగు గంటలకు విద్యుత్ పునరుద్ధ పడుతుందని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

## కబడ్డీ మ్యాట్ మంజూరు చేయాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కోరిన నాగల్ కడుమూరు క్రీడాకారులు



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : నాగల కడుమూరు గ్రామానికి కబడ్డీ మ్యాట్ ను మంజూరు చేయాలని గ్రామ క్రీడాకారులు బుధవారం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శివసేన రెడ్డి బుధవారం అమరచింతలో పర్యటించిన నేపథ్యంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ను కలిశారు. గ్రామంలో కబడ్డీ పట్ల యువకులు ఆసక్తి కలిగి ఉన్నారని కబడ్డీ ఆటను ప్రోత్సహించేందుకు తమ గ్రామానికి కబడ్డీ మ్యాట్ ను మంజూరు చేయాలని జగన్ రెడ్డి శివసేనరెడ్డిని కోరారు. మండలానికి ఒకటి మాత్రమే మంజూరు చేస్తామని శివసేన రెడ్డి తెలుపగా క్రీడాకారుల ప్రతిభ చూసి స్పోర్ట్స్ అసోసియేషన్ నుండి అయినా సరే ఒక మ్యాట్ ను మంజూరు చేస్తానని క్రీడాకారులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్ కు గ్రామ కాంగ్రెస్ నాయకులు కబడ్డీ క్రీడాకారులు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బుదురు రాజారెడ్డి, హమ్మద్ కౌసర్, శివుడు, బి చెన్నారెడ్డి క్రీడాకారులు నవీన్ దామోదర్ హైమత్, రామకృష్ణ, రవి, ఖాజా మైను ఉన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ చినబాబు



రాజవొమ్మంగి, మే 21 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలోని జడ్డంగి పోలీసు స్టేషన్ ఎస్ఐ చినబాబు పలు వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. జడ్డంగి పోలీసు చెక్ పోస్టు వద్ద వాహనదారులు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లను పరిశీలించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ లు చేయించుకోవాలని సూచించారు. వాహనదారులు రికార్డులు సక్రమంగా ఉండాలని తెలిపారు రికార్డులు సక్రమంగా లేనివారికి జరిమానాలు విధించినట్లు తెలిపారు ట్రాఫిక్ నీయమనిభందనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఆటోలలో పరిమితికి మించి లోడు ఉంటే ఫైన్ విధించబడుతుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు

## హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు. - జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : మే 21 (జనం రిపోర్టర్) వికారాబాద్ జిల్లా పరిధిలోనిధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 64/2015 సెక్షన్ లో ఇద్దరు నిందితులకు ఈ రోజు జిల్లా ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జ్ సున్నం శ్రీనివాస్ రెడ్డి జీవిత ఖైదు మరియు 1000 రూపాయల జరిమానా విధించినారు అని జిల్లా ఎస్పీ తెలిపినారు . అట్టి కేసుకు సంబంధించిన వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. తేది 02.09.2015 రోజున హరిజన్ ప్రమీలమ్మ మరియు తన కొడుకు హరిజన్ రవి లు ఆవుసుల పల్లి గ్రామం, ధరూర్ మండలం తమ ఇంట్లో ఉండగా అదే రోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అదే గ్రామానికి చెందిన %ూ%1)సోమారం సమ్మయ్య,%ూ%2)అంతరపు శ్రీనివాస్ లు తన కొడుకుని త్రాగడానికి అని బయటకు తీసుకొని వెళ్లి చంపినారు అని ఫిర్యాదు చేయగా, అప్పటి ధరూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రేమ్ కుమారు కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం అప్పటి ధరూర్ సర్కిల్ సిఐ ఏవి రంగా కేసును ధర్యాప్తు చేసి కేసు వివరాలను జడ్జ్ ముందు పెట్టగా ఈ రోజు గౌరవ జడ్జ్ నిందితులకు జీవిత ఖైదు మరియు 1000 రూపాయల జరిమానా విధించడం జరిగింది అని ఎస్పీ తెలిపినారు. ఇట్టి కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా పని చేసిన పి పి సుధాకర్ రెడ్డి,అప్పటి ఎస్సై యం. ప్రేమ్ కుమార్, సిఐ ఏవి . రంగా, ప్రస్తుత ధరూర్ ఎస్సై . అనిత, ప్రస్తుత ధరూర్ సీఐ ఇట్టి కేసు బ్రీఫింగ్ అధికారి రఘు రాములు, ధరూర్ కోర్ట్ అధికారి జె. శంకర్, లైయసన్ అధికారి వీరన్నా లను జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ అభినందించడం జరిగింది .

## అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్



రాజవొమ్మంగి,రంపచోడవరం మే 21 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని అధికారిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ రంపచోడవరం నియోజకవర్గం లోని నాలుగు కెజిబివి బాలికల విద్యాలయాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి కి చిరునామాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గంగవరం మండలం లో నెల్లిపూడి,వై రామవరం మండలం లో చవిటిదిబ్బలు, రంపచోడవరం మండలంలో ఇర్లపల్లి, మారేడుమిల్లి లలో మొత్తం నాలుగు భవనాలు నిర్మాణాలు అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పి ఓ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్,ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, అడబాల బాపిరాజు,వై నిరంజనీదేవి, కుంజం బాపన్న దొర, సిద్ధా వెంకన్న దొర, చోటు, పండ బాబి, మైనారిటీ నాయకులు ఇబ్రహీం,సూర్యనారాయణ రాజు,మీరా,పెంటమ్మ, నాగు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పాపోలు శ్రీనివాసరావు,బిజెపి పార్టీ మాజీ మండల అధ్యక్షులు మంగా రౌతు వీరబాబు, లక్ష్మి ,ప్రజా ప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ తనిఖీ చేసిన బి డి టీం మరియు డాగ్ స్క్వాడ్..!! జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా మున్సిపల్ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో మరియు రైల్వే స్టేషన్లో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ లో రైల్వే స్టేషన్ లో దొంగతనాలు జరుగుతున్న శుభ సందర్భంగా.జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు బి డి టీం డాగ్ స్వాడ్ అధికారులు వికారాబాద్ పట్టణం లోని బస్ స్టాండ్ రైల్వే స్టేషన్స్ లలో తనిఖీలు నిర్వహించడం జరిగింది.

## తీర్మానాలు చేయకుండా చెరువును దళారికి అప్పగించే హక్కు అధ్యక్షుడికి ఎవరిచ్చారు...?

సంఘంలో సమావేశం నిర్వహించి వాటాదనం పంపిణీ చేయాలి..

దళారి కాంటాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్.. విలేకరుల సమావేశంలో ఇందుర్తి మత్స్యకారులు...



**చిగురుమామిడి( జనం రిపోర్టర్):మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇందుర్తి సంగోజీపేట చెరువును దళారికి అప్పగించిన సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనుతోపాటు అందులో భాగస్వామ్యం అయిన డైరెక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం మాజీ అధ్యక్షులు గౌరవేణి కనకయ్యతోపాటు పలువురు అధికారులను కోరారు.బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ముందు పలువురు మత్స్యకారులు విలేకరులతో వారు మాట్లాడుతూ గంగపుత్రులు,ముదిరాజులు 4వందల మంది సభ్యత్వం పొంది ఐక్యమత్యంతో కలిసి సంఘం అభివృద్ధి కోసం పని చేస్తున్నామన్నారు.గత సంవత్సరం 16నెలల క్రితం గట్టు శ్రీనివాస్ అనే వ్యక్తి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత సంగోజీపేట చెరువు,ఊర చెరువులోని చేపల విక్రయించగా 6నుంచి 8లక్షల రూపాయలు వచ్చాయన్నారు.ఈ ఆదాయంలో సంఘం యొక్క ఖర్చులు పోను మిగులు డబ్బులను సంఘ సభ్యులకు వాటాదనం ఇవ్వకుండా మరల జనరల్ బాడీ సమావేశాలు పెట్టకుండా ఈనెల 18న ఆదివారం సంగోజుపేట చెరువును దళారులకు వేలంపాటలో వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వేలంపాటకు సంబంధించి కేవలం 20మంది సభ్యులతో మాత్రమే సంతకాలు పెట్టించి వేలంపాట వేశారన్నారు.సంఘంలో 4వందల మంది సభ్యులు ఉండగా జనరల్ బాడీ మీటింగ్ పెట్టకుండా తీర్మానం చేయకుండా అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ కు చెరువును దళారికి అప్పచెప్పే అధికారం ఎక్కడ ఉందని వారు ప్రశ్నించారు.సంఘంలో ఉండే మత్స్యకారులు చాపలు పట్టుకొని అమ్ముకొని జీవనోపాధి పొందే విధంగా ఉండాలే తప్ప,మత్స్యకారులకు తెలియకుండా దళారులకు ఏ విధంగా చెరువును విక్రయిస్తారని మండిపడ్డారు.ఇప్పటికైనా జనరల్ బాడీ మీటింగ్ పెట్టి సంఘంలో ఉండే ఆదాయం ఖర్చు సంఘ సభ్యులకు తెలియపరిచి మత్స్యకారులు చాపలు పట్టుకునే విధంగా తీర్మానం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.దళారికి ఇచ్చిన సంఘజీపేట చెరువును రద్దు చేయాలని సభ్యులు కోరుకుంటున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో సంఘము డైరెక్టర్ కన్నం కనకయ్య,సభ్యులు బొల్లి వెంకట నర్సు, గౌరవేని తిరుపతి,గౌరవేనీ లింగమూర్తి,పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.**

## హిందూ ఏక్తా యాత్రలో..హిందూ ఐక్యతను చాటుదాం...

పార్టీలకు అతీతంగా హిందువులను సంఘటితం చేయడమే యాత్ర లక్ష్యం..

ఏక్తాయాత్ర బీజేపీ మండల ఇంచార్జి ఖమ్మం వేంకటేశం..

ఆంజనేయ స్వామి ఆలయంలో బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు...




చిగురుమామిడి(జనం రిపోర్టర్):రాజకీయాలకు అతీతంగా హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యంగా,ఈనెల 22న గురువారం కరీంనగర్ లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రలో హిందువులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బిజెపీ ఏక్తాయాత్ర మండల ఇంచార్జి ఖమ్మం వెంకటేశం,బిజెపి పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ కుమార్ కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ శివారులోని స్వయంభు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హిందూ వ్యతిరే



యాత్ర విజయవంతం కావాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హిందూ ఏక్తా యాత్రకు మండలంలోని ప్రతి గ్రామం నుండి 3గంటలకు బస్సులు ఏర్పాటు చేశామని అందులో హిందూ బంధువులు ప్రతిఒక్కరు తరలివచ్చి సత్తా చాటాలన్నారు.మండలం నుండి దాదాపు రెండు వేల మందికి తగ్గకుండా స్వచ్ఛందంగా తరలిరావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పిల్లి నర్సయ్య గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, తాజా మాజీ ఉపసర్పంచ్లు బుదార్తి మహేందర్, జంగ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు అచ్చ రవీందర్, కంది శంకర్,భీమరా లక్ష్మణ్, గర్ధాస్ సతీష్,బుర్ర శ్రీనివాస్,నక్క రాజేందర్, గొల్లపల్లి సధాచారి,గుళ్ళ రాజు, తులాఇల వెంకటేష్, గోలి ప్రాతినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చీరాల ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ పి. శ్రీకాంత్ నీ కలిసిన కాలేషా



పొదిలి (జనం రిపోర్టర్) :ఈరోజు చీరాల ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నూతన సూపర్డెంట్ పేట. శ్రీకాంత్ గారిని కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర లిఅధ్యక్షులు షేక్. కాలేషా..వివరాలలోకి వెళితే..గత కొన్ని రోజుల క్రితం చీరాల ఏరియా వైద్యశాలలో జనరల్ సర్జన్ గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై సూపర్డెంట్ గా బాధ్యతలు స్వీకరించిన పేటా. శ్రీకాంత్ గారిని కలిసి దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ వైద్య పరీక్షలకు వచ్చినప్పుడు వారికి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరిన వెంటనే స్పందించి సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు ఇరుపని. వెంకటేశ్వర్లు, సాలెహ, కొండలు, శ్రీను తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## జిల్లా కేంద్రమైన కాకినాడలో మినీ మహానాడు



ఏలేశ్వరం, మే 21, ( జనం రిపోర్టర్) కాకినాడ జిల్లా:22.05.25 గురువారం. రోజున. జిల్లా కేంద్రమైన కాకినాడలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి నియోజవర్గ నలుమూలల నుండి వేలాదిగా టిడిపి శ్రేణులు తరలి రాగలరు. ఈ కార్యక్రమం కాకినాడ వివేకానంద పార్కు వద్ద గల గోదావరి కళాక్షేత్రం, (పాభిన్ కన్వెన్షన్ హాల్) లో అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర మరియు జిల్లా తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు మరియు ఏలేశ్వరం నగర పంచాయతీ నుండి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు తరలిరావాలని , ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## సబ్ స్టేషన్ మరమ్మతులు విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఏలేశ్వరం, మే 21, ( జనం రిపోర్టర్ ) ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో ఈనెల 24 వ తారీకు శుక్రవారంనాడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏ.ఈ జి.సూర్యనారాయణ తెలిపారు.ఏలేశ్వరం సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు చేయు నిమిత్తం మండలంలోని లింగంపర్తి,భద్రవరం,కొండ తిమ్మాపురం, మెట్ట,ఏలేశ్వరం, సి.రాయవరం, రమణయ్యపేట, మార్కండేయపురం, టి.ఎల్.పురం,కిమ్మూరు,జీ.వి. పాలెం, సత్రంపేట పాడు, మాలయ్య పాకల,పీ.జీ పాడు,అప్పన్నపాలెం తదితర గ్రామాలకు శుక్రవారం నాడు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ప్రజలకు కలుగుతున్న అసౌకర్యానికి మన్నించి సహకరించగలరని ఏఈ కోరారు.

# చాట్రాయిలో ఎండియు ఆపరేటర్ల నిరసన...



చాట్రాయి :(జనం రిపోర్టర్) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండియు ఆపరేటర్ల యూనియన్ పిలుపుమేరకు మండల యూని యన్ అధ్యక్షులు గద్దల శేఖర్ ఆధ్వర్యంలో చాట్రాయి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తాసిల్దార్ బి ఈశ్వర్ కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాట్రాయి మండలంలో 11 మంది ఎం డి యు (ఇంటింటికి రేషన్ బియ్యం సప్లై చేసే వాహనాల డ్రైవర్లు )ఆపరేటర్స్ వారితో పాటు హెల్పర్స్ ఉన్నామని, గత వైసిపి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ బియ్యం సప్లై చేసే పనిని కల్పించి మాకు ఉపాధి కల్పించిందని, గత నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న మమ్ములను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గత ప్రభుత్వంలో చేసుకున్న కాంటాక్ట్ ప్రకారం మా సర్వీసు 2027 జనవరి 25 వరకు ఉండగా ఉన్నపలంగా ఈ కూటమి ప్రభుత్వంతొలగించడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సంపద సృష్టి స్తాం అంటే ఏమో అనుకున్నామని, మా ఉపాధిని దెబ్బతీసి మా కుటుం బాలను రోడ్డున పడవేస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9,260 బియ్యం పంపిణీ చేసే వాహనాలు ఉన్నాయని, అందరం ఇప్పటివరకు దీనివలన ఉపాది పొందుతూ అందరి కుటుంబాల పోషణ కూడా బాగానే ఉందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసు కున్న చర్యతో మా కుటుంబాలు అన్ని ఉపాధిని కోల్పోయి రోడ్డున పడతామని కాబట్టి కూటమి ప్రభుత్వం మరొకసారి పునరా లోచించి యధావిధిగా మమ్ములను కొనసాగించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం డి యు యూనియన్ మండల కార్యదర్శి ఎస్ కే భాష, బొలమాల విద్యాధరరావు, అడపాల పోతు రాజు, కోటేశ్వరరావు, లంక మల్లి కార్జునరావు, నాగ వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కాలేజీలో బ్యాటరీలు చోరీ..
## ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు సమాచారం..




పొన్నూరు (జనం రిపోర్టర్) :గుంటూరు జిల్లా పొన్నూరు శివారు చింతలపూడి గ్రామ పరిధిలోని చింతలపూడి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం తెల్లవారుజామున కంప్యూటర్ లాబ్లో ఉన్న సుమారు 20 బ్యాటరీ చోరీకి గురయ్యాయి.సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై కిరణ్ బాబు ఘటన స్థలానికి వెళ్లి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని బ్యాటరీలను స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించారు. నిందితుడు ఏ ప్రాంతం వారు?.. అంతర్ జిల్లా నేరస్తుల అనే కోణంలో విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని ఆయన మీడియాకు తెలిపారు.

# ఎన్టిపిసి ప్లాంట్ లో ప్రమాదం జరిగి
## ఇద్దరు కాంటాక్ట్ కార్మికులకు తీవ్ర గాయాలు...



రామగుండం(జనం రిపోర్టర్) :ఎన్టిపిసి రామగుండం ప్రాజెక్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు గాయాలయ్యాయి వివరాలు ఇలా ఉన్నాయి, బుధవారం ఉదయం




షిఫ్టులో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీపురం చెందిన కొమురయ్య, ఎన్టిపిసి రామగుండం అన్నపూర్ణ కాలనీకి చెందిన అంకూస్ స్టేజ్ టు నాలుగోవ యూనిట్లో టర్బైన్ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా, ఆయిల్ పైప్ లైన్ లీకేజీ కావడం జరిగింది. ఈ క్రమంలో వేడి ఆయిల్ కార్మికుల పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం పర్మినెంట్ టౌన్షిప్ ధన్వంతరి ఆసుపత్రి తరలించారు. కొమురయ్యకు గాయాలు ఎక్కువ కావడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని ఎన్టిపిసి అధికారులు సందర్శించి, ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నట్లు సమాచారం..

# రక్తదానం చేయండి
## ప్రాణదాతలుగా నిలవండి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) :రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు రక్తదానం ప్రాణదానం తో సమానమన్న ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు ప్రతి ఒక్క యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నాగరాజు నవ భారత నిర్మాత రాజీవ్ గాంధీ 34 సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందు నేషనల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ మరియు తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ ఆదేశాల మేరకు వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఆధ్వర్యంలో సుమారు 60 మందితో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుఅనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించి ప్రశంస పత్రాలను అందజేసిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, యూత్ అధ్యక్షుడు




తదనంతరం తలసేమియా వ్యాధితో బాధపడుతు చికిత్స పొందుతున్న వారిని సందర్శించి వారికి మనోధైర్యం కల్పించిన ఎమ్మెల్యే నాగరాజుఅదేవిధంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈవీ శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు ఈవి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అశ్విన్ రాథోడ్, రమాకాంత్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ నేహాల్, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెవ్వ శివరామకృష్ణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్, జిల్లా, మండల, డివిజన్, గ్రామ యూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టాటా సంస్థతో కలిసి పనిచేయడం గర్వకారణం
## సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ సి ఇ వో ఇందు షానో"








నరసాపురం మే 21 జనం రిపోర్టర్: టాటా క్లాస్ ఎడ్జ్ ప్రోగ్రామ్ ను బుధవారం పట్టణం లోని కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని నర్సాపురం మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీమతి వెంకట రమణ,సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూల్ సి ఇ వో ఇందు షానో లు ప్రారంభించారు.సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూల్, దేశ విఖ్యాత టాటా క్లాస్ ఎడ్జ్ తో కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదిరిందని, ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో ప్రత్యేకమైన కలయిక, ఈ కలయిక ద్వారా అనేకమంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని సి ఈ ఓ ఇందు షానో అన్నారు. విద్యతోపాటు, నూతన సాంకేతిక విధానాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శన, యోగ ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ మేనేజర్ నారాయణ బాబు, శ్రీదేవి, సుధీర్, రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆకాల వర్షాలు గుంతల
## మాయంగా మారిన నాగరం, సుదన్ పల్లి రోడ్డు



హసన్ పర్తి మండలం మే 21 జనం రిపోర్టర్ : హసన్ పర్తి మండల పరిధిలోని నాగరం గ్రామంలో నాగరం నుండి సుదన్ పల్లి కి వెళ్ళే ప్రధాన రహదారి వరుసగా కురస్తున్న ఆకాల వర్షాలకు గుంతల మాయంగా మారీ, వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్నది వర్షాకాలం అపుడు రోడ్ల పరిస్థితి ఇంకా అధ్వానంగా మారే పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని



పై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించి రోడ్డు వేయవలసిందిగా ప్రజలు, వాహన దారులు, నాగారం, సుదనపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# బాంబు డిస్పోజల్
## టీం, డాగ్ తో మేడిపల్లి పోలీసుల తనిఖీలు




మేడ్చల్ జిల్లా, మేడిపల్లి జనం రిపోర్టర్ : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజల భద్రతను, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఇన్స్పెక్టర్ మేడిపల్లి ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్ టీం డాగ్ తో కలిపి, పోలీస్ సిబ్బంది, ప్రజలు రద్దీగా ఉండే హొటల్స్ షాపింగ్ మాల్స్, (బాబాయ్ హొటల్, సి ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్, కేఎల్ఎమ్ షాపింగ్ మాల్, ఉప్పల్ డిపో) పరిసర ప్రాంతాలను అనుమానాస్పద వ్యక్తులను, అనుమానాస్పద వస్తువులను పూర్తిగా తనిఖీలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు సంతరించినట్లయితే అనుమానాస్పద వస్తువులు ఉన్నట్లయితే, వేరు వేరు రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే పోలీసు వారికి డయల్౼100 కి సంప్రదించగలరని సీఐ గోవింద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్సీపీ మండల
## పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామ చేసిన లెక్కల

:నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ మండల పార్టీ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన తన కున్న వ్యక్తిగత కారణాలు వల్ల మండల పార్టీ అధ్యక్ష పదవికి ఈ రోజు రాజీనామా చేసానని తెలియజేశారు. ఆయన తన రాజీనామా పత్రాన్ని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కి నర్సీపట్నం పార్టీ కార్యాలయంలో అందజేసినట్లు లెక్కల సత్యనారాయణ స్పష్టం చేశారు.

# ఘనంగా రాజీవ్గాంధీ వర్ధంతి

దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నంగిన రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అబీడ్ సెంటర్లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అనకాపల్లి జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్ గాంధీ ఆద్యుడని తెలిపారు. భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. కంప్యూటర్లు,సెల్ ఫోన్లు, టెలికాం, ఐటీ రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత, దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన నాయకుడన్నారు. ఆయన ఆశయాల కొరకు ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాల సాంబశివరావుల్, రాజాం రాజు, అధికారి చిన్నిలు , నాయుడు, సిద్ధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా సర్వే ను నిలిపివేయడంలోని
## అంతరార్థం ఏమిటి? మచ్చ పేట రైతు ముత్తె రాజయ్య

ఈనెల 21న సర్వేనెంబర్ (32) కు సంబంధించిన భూమి సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని నోటీసులు పంపిన సర్వేయర్ చారి అర్ధాంతరంగా సర్వే చేయడం లేదని బుధవారం ఉదయం తెలిపారని మచ్చుపేట రైతు ముత్తే రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తమ భూమి సర్వే చేయాలనే విషయం పై కలెక్టర్ కు 11-ఫిబ్రవరి-2025 న వినతి పత్రం అందజేశానని అన్నారు. తన వినతి పై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ విచారణ జరిపి 18. ఫిబ్రవరి.25 న విచారణ నివేదిక ఆధారంగా గొర్ల రాజయ్య సర్వే. నంబర్ 30/ఏ/1, (4.11%ఇ%000) ఎకరాలు,గొర్ల కొమురయ్య సర్వే నంబర్ 30/బి/బి/బి (1.34) గుంటలు భూమి రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా మోఖా మీద భూమి లేదని కలెక్టర్ విచారణలో తేలిందని అన్నారు. అయినా కాని కలెక్టర్ నీకిలీ పాసు పుస్తకాలను రద్దు పరచలేదన్నారు.లేని భూములను సర్వే చేశానని చెప్పిన డి ఐ, గణపతి, ఏడి, శ్రీనివాస్ (ల్యాండ్ అండ్ సర్వే-రికార్డు డిపార్టమెంట్) వారిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. తన భూమికి సంబంధించిన హద్దుల నిర్ణయం విషయంలో ఇదేమి న్యాయమని తాను 5 మే 2025న జిల్లా కలెక్టర్ ను అడగగా మీ 32 సర్వే నెం.కు హద్దులు చూపిస్తామని,మీరు మంథని ఆర్డీవో ను కలవమని సూచించారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నేను ఆర్డీవోను కలువగా సర్వేయర్ చారీని మచ్చుపేట శివారులో గల సర్వే నెం. 32 భూమిని హద్దులు చూపించాలని ఆదేశించారని తెలిపారు.దీని ప్రకారం సర్వేయర్ చారి 21.05.2025 న మచ్చుపేట మీ భూమి మోకా పైకి వచ్చి సర్వే నంబర్ 32 హద్దులు చూపిస్తామని నోటీసులు పంపించారనీ అన్నారు. తాము సర్వేయర్ రాక కోసం ఎదురుచూస్తున్న తరుణంలో 21.05.2025 న ఉదయం 9-15 గంటలకు ఫోన్ చేసి సర్వే నంబర్.32 లో సర్వే చేయడం లేదని తెలిపారని అన్నారు. సర్వేను అర్ధాంతరంగా ఎందుకు రద్దు చేశారని సర్వేయర్ ను అడగగా అతను తనకు డిఐ, గణపతి, ఏడి, శ్రీనివాస్ ఫోన్ చేసి 32 సర్వేనెంబర్ లో సర్వే చేయకూడదని తనను ఆదేశించారని చెప్పారని అన్నారు. పై అధికారుల ఆదేశాలను తాను పాటించాలని కూడా అన్నారని తెలిపారు. ఈ విషయంలో భూమిలేని గొర్ల రాజయ్య వద్ద నుండి డబ్బులు తీసుకుని డిఐ, గణపతి, ఏడి, శ్రీనివాస్ కుమ్మక్కై తనకు సంబంధించిన సర్వేనెంబర్ 32/ఏ/1 భూమిని సర్వే చేయకుండా లోపాయికారిగా గొర్ల రాజయ్యకు సహకరిస్తున్నారని ఆరోపించారు. వారి పై సత్వరమే శాఖపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అలాగే మోకాపై లేని భూమికి పట్టాలు కలిగి ఉండి రైతుబంధు డబ్బులు తీసుకుంటూ బ్యాంకులో పంట రుణం తీసుకుంటూ ప్రభుత్వాన్ని, బ్యాంకులను మోసం చేస్తున్న గొర్ల రాజయ్య పై చీటింగ్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన చేవెళ్ల
## నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్

:మొయినాబాద్ : పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్ నగర్ చౌరస్తా లో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరు పుకున్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పలువురు నేతలు పూల మాలలు వేసి నివాళి ఆర్పించారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ దేశానికి దిక్సూచి, ఐటీ రంగ అభివృద్ధి ప్రధాత, దేశాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి ఉగ్రమూక దాడికి బలైన రాజీవ్ జీ.నీ ఆశయం, స్ఫూర్తి మాకు, భవిష్యత్ తరాలకు ఎప్పుడూ స్ఫూర్తి దాయకమే అని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య, నవాబ్ పెట్ మండల అధ్యక్షులు వెంకటయ్య, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య ,చేవెళ్ళ నియోజక వర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు , పళ్ళగోల్ల అశోక్ యాదవ్, హిమాయత్ నగర్ విలేజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్రకాయల రమేష్, ఫైలు ధనరాజు, కంజర్ల శివయ్య, రాజు గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ఎస్ యుఐ మరియు ఇతర అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిట్యాల మండల కేంద్రం లో
## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

:చిట్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఏడవ ప్రధానిగా చేసిన సేవలు మరువలేనివి, దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో పునాదివేసి రంగాన్ని అభివృద్ధి చేసి ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీ గారికీ దక్కుతుందని,నాటి నుండి నేటి వరకు ఐటీ రంగం అభివృద్ధి చెందిందంటే దానికి కారకులు స్వర్గీయ రాజీవ్ గాంధీ కారకులని మూలశంకర్ గౌడ్ తెలిపారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని,దేశానికి అంకితం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి చిలుకల రాయకొమురు, జిల్లా అధికార ప్రతినిధి కిష్టయ్య,గుమ్మడి సత్యనారాయణ, చిలుముల రాజమౌళి,బుర్ర మల్లేష్,గుర్రపు తిరుపతి, బుర్ర కరుణాకర్, శనిగర మొగిలి,గుర్రపు నరసయ్య, ఆరేపల్లి నరసింహారాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతును మోసలి లాక్కెళ్లిన
## నదీ ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

:కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుసుమూర్తి గ్రామ శివారులోనీ, భీమా నది లో జింకల తిప్పన్న అనే రైతును ముసలి లాక్కెళ్ళగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ బీమా నది పరిసరాలను పరిశీలించి అక్కడి అధికారులతో ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఎన్ డి ఆర్ ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు, ఫారెస్ట్ అధికారులు, గజ ఈతగాళ్లు, లోకల్ పోలీసులు సంయుక్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తనిఖీ నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, కృష్ణ ఎస్ ఐ ఎస్. ఎం నవీద్, ఎమ్మార్వో, కృష్ణా పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కుత్బుల్లాపూర్ పర్యటనలో భాగంగా బాలానగర్ చౌరస్తాలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు స్వాగతం పలికారు.అనంతరం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయాన్ని పరిశీలించారు.

# హరితహరం-2025 సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హరితహరం-2025 సమీక్ష సమావేశంలో స్థానిక శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి పాల్గొన్నారు, ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ, మన ఊరు - మన పచ్చదనం పరిశుభ్రతలో బాగంగా ప్రతి పౌరుడు ఒక మొక్కను నాటి, సంరక్షించుకోవాలి అని అన్నారు. తద్వారా సకాలంలో వర్షాలు పడతాయని అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కొంత పరిధి వరకు బాధ్యతగా తీసుకొని మొక్కలను సంరక్షించుకోవలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలని అన్నారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# 'అఖిలపక్షం వేళ' అనైక్యత!

## (విశ్లేషణ)

దేశం కోసం సమష్టిగా కదలాల్సిన సందర్భాల్లో సైతం కలవలేనంతగా అధికార విపక్షాలు ఎడ మొహం పెడమొహంగా మారాయి. పెహల్‌గామ్‌లో గత నెల 22న ఉగ్రవాదులు సాగించిన మారణ కాండ మొదలు మన ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్, ఈ నెల 10న కాల్పుల విరమణ, పాకిస్తాన్ దురాలోచనలూ వగైరా ప్రపంచానికి తెలియజెప్పేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల కూర్పు ప్రక్రియ వివాదాస్పదంగా మారటం దీన్ని చాటుతోంది. మన దేశంనుంచి సమష్టి స్వరం వినబడితే దాని ప్రభావం వేరుగా వుంటుంది. పాకిస్తాన్ సైతం ఇదే తరహాలో అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపటానికి సన్నాహాలు చేసుకుంటున్నది. కనీసం ఇందుకోసమైనా విభేదాలు పక్కనబెట్టి ఒక్కటై నిలబడదామన్న స్పృహ అటూ ఇటూ కరువవుతోంది. ఏ దేశంలోనూ ఇలా వుండదు. అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రం (డబ్ల్యూటీసీ)పై ఉగ్రదాడి మొదలు ఇందుకు ఎన్నయినా ఉదాహరణలివ్వొచ్చు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరుతో అమెరికా అఫ్గాన్‌ను వల్లకాడు చేసింది. చివరకు ఒరిగిందేమీ లేదు. అఫ్గాన్‌నుంచి అవమానకరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. అయినా అక్కడి విపక్షం మౌనంగా ఉండిపోయింది. కానీ ఇక్కడలా కాదు. యూపీఏ హయాంలో ముంబైపై ఉగ్రదాడి, దానికి వెనకాముందూ జరిగిన అనేకానేక ఉదంతాల్లో మన దేశంలో అధికార పక్షంపై విపక్షం విరుచుకుపడటం, యక్షప్రశ్నలు వేసి ఇరుకున పడేసే ప్రయత్నం చేయటం రివాజుగా మారింది. యూపీఏ హయాంలో బీజేపీ విపక్షంలోవుండి ఏం చేసేదో, ఇప్పుడు కాంగ్రెస్ సైతం ఆ పనే చేస్తోంది. పుల్వామా ఉగ్రదాడి సమయంలో మరీ దారుణం. జవాన్ల త్యాగాలూ, వారు దెబ్బకు దెబ్బ తీసిన వైనమూ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చర్చనీయాంశంగా మారటం ఆశ్చర్యపరిచింది. ఈ ఉదంతాలను బీజేపీ తనకను కూలంగా మలుచుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం చాటింపు వేసింది. అయితే మన దేశంలోనూ ఒకప్పుడు అధికార, విపక్షాలు కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాలు లేకపోలేదు. ఇందుకోసం ఎన్నడో 1971 నాటి భారత్-పాక్ యుద్ధం వరకూ పోనవసరం లేదు. 1994లో కశ్మీర్‌పై భారత్ వైఖరిని వివరించటానికి నాటి ప్రధాని పీవీ నరసింహారావు రూపొందించిన అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించింది అప్పటి విపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి! పాతికేళ్ల క్రితం కార్గిల్ యుద్ధ సమయంలో నాటి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెస్‌తోసహా విపక్షాలూ దేశభద్రత కోసం కలిసికట్టుగా పనిచేశాయి. కానీ ఇప్పుడెందుకు పరస్పరం తప్పులు వెదుక్కొనే తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నట్టు? దేశంలో తక్షణం వచ్చే ఎన్నికలేమీ లేవు. అయినా పెహల్‌గామ్‌ను రాజకీయంగా వినియోగించుకోవటానికి అటూ ఇటూ పోటీపడుతున్నారు. త్రివిధ దళాల అధికార ప్రతినిధులు చెప్పేవరకూ ఆగకుండా ఇష్టానుసారం ఉన్నవీ లేనివీ ప్రచారం చేసి, విపక్షాలను పాకిస్తాన్ అనుకూలురుగా, దేశద్రోహులుగా చూపటానికి బీజేపీ శ్రేణులూ, సాను భూతిపరులూ చేయని ప్రయత్నం లేదు.తొలి ప్రధాని నెహ్రూ ఉదారంగా పాకిస్తాన్‌కు నదీజలాలు, భారీయెత్తున సొమ్ము కట్టబెట్టారని బీజేపీ నేతలు ఇంకా ఆరోపణలు గుప్పిస్తూనే వున్నారు. ఒకపక్క అఖిలపక్షాన్ని పంపుతూ మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? వీటిని ఎలా ఎదుర్కొనాలో తెలియక ఇష్టానుసారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చులకనవుతున్నారు. యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి... మనవైపు జరిగిన నష్టమెంత అంటూ రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇవి అడగకూడని ప్రశ్నలేమీ కాదు... కానీ అందుకు తగిన వేదికను ఎంచుకోవాలని కూడా ఆయనకు తోచదు.ఇంతకూ అఖిలపక్ష బృందాల కూర్పుపై ఇంత వివాదం ఎందుకొచ్చినట్టు? విపక్షాలను విశ్వా సంలోకి తీసుకుని, వారు పంపిన పేర్లనుంచి ఎంపికచేసే కనీస మర్యాద అధికార పక్షం పాటించివుంటే సమస్య తలెత్తేది కాదు. విపక్షానికి ఆలోచించే శక్తిసామర్థ్యాలు లేవన్నట్టు సర్కారు ప్రవర్తించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు సభ్యుల పేర్లు పంపితే వారిలో ఒక్కరినే ఎంపిక చేసింది.పోనీ సర్కారు ఎంచుకున్నది కూడా సమర్థుల్నే కదా అనే సర్దుబాటు ధోరణి కాంగ్రెస్‌కు లేదు. అసలు ఆ పార్టీ నుంచి వెళ్లిన జాబితాలో సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్, మనీష్ తివారీ తదితరుల పేర్లు ఎందుకు లేకుండా పోయినట్టు? సీనియర్ నేత ఖుర్షీద్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం తీరా ఆయన సీనియారి టీని కాదని జేడీ(యూ) నేత సంజయ్ ఝూకు సారథ్య బాధ్యతలు ఎందుకిచ్చినట్టు? సమష్టి స్వరం వినబడాల్సిన ఈ సమయంలో ఇన్ని లుకలుకలుండటం మంచిదేనా? ఇంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ చివరకు ఈ వివాదాన్ని పొడిగించదల్చుకోలేదని చేతులెత్తేసింది.కానీ ఎప్పుడూ వీరంగం వేసే అలవాటున్న తృణమూల్ మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన సభ్యుణ్ణి తప్పుకోమని చెప్పింది. దాంతో ప్రభుత్వం తగ్గి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ సూచించిన నేతకు స్థానం కల్పించింది. అఖిలపక్షం పంపటంలోని ఉద్దేశమే సమష్టితత్వాన్ని, ఈ దేశ సంకల్పాన్ని, పాకిస్తాన్ కుయుక్తులను చాటడానికైనప్పుడు సభ్యుల ఎంపిక వివాదాస్పదం కాకుండా ప్రభుత్వం చూడాల్సింది. ఈమధ్య ఆపరేషన్ సిందూర్ మొదలుకొని పార్టీ వైఖరికి భిన్నంగా పలు ప్రకటనలిస్తూ సంచలనం సృష్టిస్తున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేయకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన్ను ఏరికోరి ఎంపిక చేయటం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికేనన్న విషయంలో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ఏదేమైనా ఇలాంటి సంక్షోభ సమయాల్లో అవసరమైన సంయమనం, హుందాతనం ఇరువైపులా కనబడకపోవటం దురదృష్టకరం.

# పాక్‌పై భారత్ దౌత్య యుద్ధం.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా
# 33 దేశాల్లో 59 మంది యంపి లు పర్యటన!

న్యూఢిల్లీ, మే 21: పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్తాన్ పై దౌత్య యుద్ధానికి 59 మంది భారత ఎంపీలు రంగంలోకి దిగబోతున్నారు. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ తో భారత సైన్యం సత్తాను ప్రపంచానికి చాటిన భారత్.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్ర సంస్థలకు ఆశ్రయమిస్తున్న పాక్ తీరును అంతర్జాతీయ స్థాయిలో ఎండగట్టేందుకు ఏడు బృందాలతో కూడిన 59 ఎంపీలు 33 దేశాల్లో పర్యటింకానున్నారు. ఆపరేషన్ భారత్ ద్వారా ఉగ్రవాదం పై భారత విధానాన్ని.. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రపంచ దేశాలు ఏకతాటి పైకి రావాలన్న సందేశంతో పాకిస్తాన్ పై దౌత్య పోరాటాన్ని ఉధృతం చేయనుంది భారత్.పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది కేంద్రం... ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన) నేతల నేతృత్వంలో ఒక్కో బృందంలో 8- 9 మంది ఎంపీలు మొత్తంగా 59 మంది ఎంపీలు 33 దేశాల్లో పర్యటించనున్నారు.7 అఖిలపక్ష ఎంపీల బృందాలు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి భారత్ వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్ తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు ఏంటి..? పాక్ బెదిరింపులకు దీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్ను ఎలా చేపట్టిందనేది ప్రపంచదేశాల ప్రతినిధులకు భారత ఎంపీల ప్రతినిధి బృందం వివరించనుంది. భవిష్యత్తులో భారత్ పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలను వివరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని తెలపనున్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును సైతం భారత ఎంపీలు విదేశీ నేతలకు వివరించనున్నారు. ఇందుకోసం విదేశాలకు వెళ్లే ఎంపీల బృందాలకు సమగ్ర సమాచారాన్ని విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరించనున్నారు..పార్లమెంట్ హౌస్‌లో రెండు దశల్లో ఎంపీల బృందాలకు పాకిస్తాన్ ఉగ్రవాద వివరాలు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలపనున్నారు..మే 20న సంజయ్ ఝా, కనిమొళి, శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి వివరాలు తెలిపింది. విదేశాంగశాఖ.. అనంతరం ఈ మూడు బృందాలు మే 21 %-% 23 మధ్య విదేశీ పర్యటనకు వెళతాయి. మే 23న మిగిలిన నాలుగు ప్రతినిధి బృందాల (శశి థరూర్, రవిశంకర్ ప్రసాద్, సుప్రియా సూలే, బైజయంత్ పాండా) సభ్యులకు సమాచారం ఇస్తారు విదేశాంగ కార్యదర్శి ఉగ్రవాద దాడులలో పాకిస్తాన్ ప్రమేయం గురించి ఆధారాలు, సమాచారం ఎంపీ ప్రతినిధి బృందాలకు విదేశాంగ కార్యదర్శి అందిస్తారు. అనంతరం మే 23 %-% 25 మధ్య విదేశీ పర్యటనకు వెళతాయి మిగిలిన నాలుగు బృందాలు..సుమారు 10 రోజులపాటు విదేశాల్లో పర్యటించి జూన్ మొదటి వారానికి తిరిగి భారత్ తిరిగిరానున్నారు . 33 దేశాల రాజధానులకు వెళ్లే ఏడు గ్రూపుల్లో 59 మంది ఎంపీలు ఉండగా మొత్తం 20 మంది బిజెపి ఎంపీలకు ఇందులో స్థానం దక్కింది..కేవలం ముగ్గురు కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీలను మాత్రమే కేంద్రం ఎంపిక చేసింది. ప్రస్తుతం ఏ సభలోనూ సభ్యత్వం లేని రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, మాజీ కేంద్రమంత్రి ఎం.జె. అక్బర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మానఖుర్షీద్, మాజీ ఎంపీ ఎస్ఎస్ ఆహ్లూవాలియాలకూ స్థానం కల్పించింది%ౕ%కేంద్రం..విదేశాలకు వెళ్లే అఖిలపక్ష బృందంలో బిఆర్ఎస్, జనసేన ,వైసిపి సభ్యులకు స్థానం దక్కలేదు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారతదేశ విధానాన్ని,చర్యలను వివిధ దేశాలకు తెలియపరచనున్న అఖిలపక్ష ప్రతినిధులు ఉగ్రవాదంపై భారత్ జీరో టోలరెన్స్ అనే బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్లనున్నారు. శశి థరూర్ నేతృత్వం లో 9 మంది సభ్యుల బృందం యుఎస్ఏ, పనామా, గుయానా, బ్రెజిల్, కొలంబియాలో పర్యటించనున్నారు. రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం యుకె, ఫ్రాన్స్, జర్మనీ, యూరోపియన్ యూనియన్, ఇటలీ, డెన్మార్క్ పర్యటించనున్నారు. సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం ఇండోనేషియా, మలేషియా, కొరియా, జపాన్, సింగపూర్ లో పర్యటించనున్నారు. బైజయంత్ పాండా నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియాలో పర్యటించనున్నారు. కనిమొళి కరుణానిధి నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం స్పెయిన్, గ్రీస్, స్లోవేనియా, లాట్వియా, రష్యాలో పర్యటించనున్నారు. సుప్రియా సూలే నేతృత్వంలో 9 మంది సభ్యుల బృందం ఈజిప్ట్, కతార్, ఇతియోపియా, సౌత్ ఆఫ్రికాలో పర్యటించనున్నారు. శ్రీకాంత్ ఏక్నాథ్ షిండే నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం యూఏఈ, లైబీరియా, కాంగో, సియర్రాలో పర్యటించనున్నారు. పాక్ పై భారత్ దౌత్య యుద్ధంలో భాగంగా ఏడు ఎంపీల అఖిలపక్ష బృందాలు ఉగ్రవాదానికి పాక్ అందిస్తున్న సాయం, ఆపరేషన్ సిందూర్ వివరాలు %ఖచీ% భద్రతా మండలి సభ్యులతో సహా కీలక భాగస్వామి దేశాలకు ఏడుగురు ఎంపీల బృందాలు వివరిస్తాయి. ఆపరేషన్ సిందూర్ గురించి కేంద్రం ఏర్పాటుచేసిన ఏడు అఖిలపక్ష ఎంపీల బృందాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి అవకాశం లభించింది. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, జీహెచ్ఎం బాలయోగి, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీలకు అఖిలపక్ష బృందంలో సభ్యులుగా స్థానం దక్కింది. యుకె, ఫ్రాన్స్, జర్మనీ, యూరోపియన్ యూనియన్, ఇటలీ, డెన్మార్క్ లో పర్యటించనున్న బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పర్యటిస్తారు. ఈజిప్ట్, కతార్, ఇతియోపియా, సౌత్ ఆఫ్రికాలో పర్యటించనున్న టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు పర్యటిస్తారు. యుఎస్ఏ, పనామా, గుయానా, బ్రెజిల్, కొలంబియా లో పర్యటించనున్న టీడీపీ ఎంపీ జిఎం హరీష్ బలయోగి పర్యటిస్తారు. సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియాలో పర్యటించనున్న ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పర్యటించనున్నారు.




### ఏ బృందం ఏయే దేశాలకంటే..

అమెరికాకు శశిథరూర్ నేతృత్వంలోని బృందం, తూర్పు ఐరోపా దేశాలకు బైజయంత్ పాండా బృందం, రష్యాకు కనిమొళి నేతృత్వంలోని బృందం, ఆగ్నేయాసియాకు సంజయ్ ఝా బృందం, మిడిల్ ఈస్ట్ దేశాలకు రవిశంకర్ ప్రసాద్ బృందం, పశ్చిమాసియా దేశాలకు సుప్రియా సూలే బృందం, ఆఫ్రికన్ దేశాలకు శ్రీకాంత్ షిండే బృందం, అంతర్జాతీయ సమాజం ముందు పాక్ నిజస్వరూపం, 33 దేశాల్లో పర్యటించనున్న భారత్ బృందాలు, ఏడుగురు ఎంపీల నేతృత్వంలో అఖిలపక్ష బృందాలు, దౌత్య యుద్ధంకోసం బయలుదేరిన మూడు బృందాలు, మూడు బృందాల ప్రతినిధులతో విక్రమ్ మిస్రీ భేటీ, తెలుగురాష్ట్రాలనుంచి కమిటీల్లో నలుగురికి చోటు ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత్ సైనిక చర్యతో పాకిస్తాన్లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది భారత్. తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. పాకిస్తాన్ ఎయిర్ బేస్ ధ్వంసం సహా కోలుకోలేని దెబ్బ కొట్టడంతో కాల్పుల విరమణ కు ముందుకొచ్చింది భారత్. మొదటి నుంచి భారత పోరు ఉగ్రవాదం పైనే కానీ పాకిస్తాన్ సైన్యం పైన పాకిస్తాన్ ప్రజల పైన కాదన్న భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది..అయినా సింధూ నది జలాల ఒప్పందం నిలిపివేత , ఆర్థిక వాణిజ్య ఆంక్షలు పాకిస్తాన్ పై భారత్ కొనసాగిస్తుంది..అందులో భాగంగా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఏ విధంగా ప్రోత్సహిస్తుందనేది తెలిపేందుకు దౌత్య పరమైన పోరాటాన్ని భారత్ ముమ్మరం చేస్తూ ప్రపంచ దేశాలకు పాకిస్తాన్ వైఖరిని ఎండగడుతూ ఆర్థికంగా,వాణిజ్య పరంగా ప్రపంచదేశాలతో సంబంధాల పరంగా మరిన్ని చిక్కులు సృష్టించబోతోంది భారత్. భారత్ పోరాటానికి తలొగ్గి ఉగ్ర సంస్థలు ఉగ్రవాదులపై పాక్ చర్యలు తీసుకుంటుందా లేక కయ్యానికి మరోసారి కాలుదువ్వుతుందా అనేది వేచిచూడాలి. ఆపరేషన్ సింధూర్‌పై వివిధ దేశాల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అఖిలపక్ష ప్రతినిధి బృందానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధిగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం తృణమూల్ కాంగ్రెస్ నుంచి మొదట ఎంపీ యూసుఫ్ పఠాన్‌ని ఈ బృంద సభ్యుడిగా ఎంపిక చేసింది. ఈ ఏకపక్ష నిర్ణయాన్ని మమతాబెనర్జీ వ్యతిరేకించటంతో యూసుఫ్ పఠాన్ బృందంనుంచి వైదొలిగారు. కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా శశిథరూర్ ఆ పార్టీనుంచి ఓ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ ఎంపీలు లావు కృష్ణ దేవరాయలు, గంటి హరీష్‌మాధుర్‌కి విదేశాలకు వెళ్లే అఖిలపక్ష కమిటీల్లో చోటు దక్కింది. అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తాయి. 59మంది సభ్యులతో కూడిన ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల్లో సుమారు 10 రోజులపాటు పర్యటిస్తాయి.

# దేశానికి ద్రోహులు.. ఇంట్లో మాత్రం శుద్ధపూసలు.. వెలుగులోకి సంచలనాలు..!

ఒకడేమో దేశంపై కుట్ర చేశాడు. మానవ బాంబులను ఉపయోగించి వీలైనంత మందిని హతమార్చేందుకు ప్లాన్ చేశాడు. మరొకడు యాంటీ ఇండియా గ్రూపులో చేరి దేశంపై సైబర్ వార్‌కు దిగాడు. మరో కిలాడీ లేడీ.. యూట్యూబర్ ముసుగులో దేశ రహస్యాలను శత్రు దేశానికి అమ్మేసింది. ఇలాంటి 17 మంది దేశద్రోహులను గుర్తించిన పోలీసులు.. మిగిలిన వారి జాడ వెలికితీసే పనిలో పడ్డారు. అయితే కరుడు గట్టిన ఈ ద్రేశద్రోహులను.. శుద్ధపూసలని చెబుతున్నారు వారి కుటుంబ సభ్యులు. హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర చేసిన కేసులో సిరాజ్, సమీర్ అనే యువకులను అరెస్ట్ చేసిన ఎన్ఐఏ అధికారులు వారినుంచి ఉగ్ర సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పేలుళ్ల కుట్రపై దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐసిస్ భావజాలానికి ఆకర్షితులై పేలుళ్లకు సిద్ధపడ్డారు సిరాజ్, సమీర్. తన ఉనికిని చాటుకునేలా జనసాంద్రత ఎక్కువగా ఉన్నచోట భారీ పేలుళ్లకు కుట్ర చేశారు. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా సేకరిస్తున్నారు ఎన్ఐఏ అధికారులు. అయితే ఇంత జరుగుతున్నా కూడా తన తమ్ముడు అమాయకుడని చెబుతోంది సమీర్ సోదరి ఆలియా. అతడికి లిఫ్ట్‌ను రిఫేర్ చేయడంతో తప్ప మరో విషయం తెలియదని వాపోతోంది. మరోవైపు వీడియోల మాటున విదేశీ గూఢచర్యం చేస్తూ పట్టుబడింది జ్యోతి మల్హోత్రా అనే యూట్యూబర్. పాక్ ఏజెంట్లతో డీల్స్ కుదుర్చుకుని దేశ రహస్యాలను అమ్మేసింది. ఈమె కేసును విచారించే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెహల్గామ్ ఘటన వెనుక కూడా ఈమె హస్తం ఉందన్న అనుమానాలు బయటపడుతున్నాయి. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో సబ్ స్క్రైబర్స్‌నే కాదు పుట్టిన నేలనూ, కన్నవారినీ అడ్డంగా, నిలువునా మోసం చేసింది ఈ దేశద్రోహి. అయితే ఇంత చేసినా తన కుమార్తెపై ఇసుమంతైనా అనుమానం రాలేదంటున్నాడు ఆమె తండ్రి హరీష్. ఆమె ఢిల్లీ వెళ్లి వస్తున్నట్టు తనకు తెలుసు తప్ప.. పాకిస్తాన్‌కు వెళ్లిన విషయమే తనకు తెలియదంటున్నాడు.




జ్యోతి, సమీర్, సిరాజ్‌లే కాదు నిత్యం మనతోనూ ఉండి మనపైనే కుట్రలు చేస్తున్నారు అనేక మంది దేశద్రోహులు. మన మధ్యనే మన చుట్టూ ఉంటూ.. నిశ్శబ్దంగా ఎవరి పనుల్లో వాళ్ళు ఉంటున్నారు. అయితే అదను చూసి దేశంపై దాడికి దిగుతున్నారు. ఇదే క్రమంలో సైబర్ టెర్రరిస్ట్‌గా మారిన జాసిమ్ అన్సారీ అనే వ్యక్తిని గుజరాజ్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో యాంటీ ఇండియా గ్రూపులో చేరి ప్రభుత్వ వెబ్‌సైట్ల్‌పై సైబర్ దాడులు చేశాడు ఈ దేశద్రోహి. ప్రస్తుతం ఇలాంటి ద్రోహుల జాడ కనిపెట్టే పనిలో పడ్డాయి భద్రతా దళాలు. శత్రుదేశంతో చేతులు కలిపి దేశంలో కుట్రలు చేస్తున్న ఇలాంటివారిని వలవేసి పట్టుకుంటున్నారు.

# ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డ్రోన్లు ఏ దేశాల వద్ద ఉన్నాయో తెలుసా ?

ప్రపంచవ్యాప్తంగా డ్రోన్ టెక్నాలజీ అనూహ్యంగా దూసుకుపోతుంది. ఆధునిక యుద్ధాల్లో వీటి పాత్ర కీలకంగా మారిపోయింది. సైనిక వ్యూహాల్లో డ్రోన్లు అంతర్భాగంగా మారిపోయాయి. గూఢచర్యం నుంచి ప్రత్యక్ష దాడుల వరకు ఈ మానవరహిత వైమానిక వాహనాలు యుద్ధభూమిలో సరికొత్త శకాన్ని ఆరంభించాయి. ఇటీవల భారత్-పాక్ సరిహద్దులో పాకిస్తాన్ నుంచి వచ్చిన వందలాది డ్రోన్లను భారత వాయు రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా కూల్చివేసింది. అలాగే, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇరు దేశాలు డ్రోన్లను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన డ్రోన్లను కలిగి ఉన్న దేశాలు ఏవో, వాటి ప్రత్యే కతలు ఏంటో వివరంగా ఈ వార్తలో తెలుసుకుందాం.

డ్రోన్ అంటే ఏమిటి?

డ్రోన్‌లు సాధారణంగా చిన్న లేదా మధ్యస్థ పరిమాణంలో ఉండే మానవరహిత వైమానిక వాహనాలు . వీటిని రిమోట్ కంట్రోల్ ద్వారా గానీ, లేదా ముందే ప్రోగ్రామ్ చేసిన మార్గంలో ఆటోమేటిక్‌గా గానీ ఆపరేట్ చేస్తారు. రోబోటిక్స్, ఏరోనాటిక్స్, అత్యాధునిక సెన్సార్ల కలయికతో ఇవి పనిచేస్తాయి. సైనిక అవసరాలకే కాకుండా, డ్రోన్‌లను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మ్యాపింగ్, నిఘా, వ్యవసాయం (స్ప్రింగ్లింగ్), ప్యాకేజింగ్ డెలివరీ, పరిశోధన, మౌలిక సదుపాయాల తనిఖీ వంటి అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రమాదకరమైన డ్రోన్లు కలిగిన దేశాలు

అమెరికా దగ్గర MQ-9 రీపర్ అనే డ్రోన్ ఉంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన, అధునాతన డ్రోన్ %పీు%-9 రీపర్ ఇదే. దీనిని అమెరికా తన సొంత అత్యాధునిక టెక్నాలజీతో



నిర్మించింది. శత్రు స్థావరాలను గుర్తించడానికి, ప్రత్యక్ష దాడులు చేయడానికి ఈ డ్రోన్‌ను వినియోగిస్తారు. ఇది ఎక్కువసేపు గాలిలో ఉండగలదు. చాలా ఎత్తులో ఎగరగలదు. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. MQ-9 రీపర్ దాదాపు 1,900 కిలోమీటర్ల (19,000 కిలోమీటర్లు కాదు) వరకు ప్రయాణించగలదు.

అలాగే, 50,000 అడుగుల (సుమారు 15 కిలోమీటర్లు) ఎత్తులో కూడా ప్రయాణించగల సామర్థ్యం దీనికి ఉంది. ఒక్కో MQ-9 రీపర్ డ్రోన్ ధర దాదాపు రూ. 125 కోట్ల నుంచి రూ. 250 కోట్ల వరకు ఉంటుంది.అత్యంత ప్రమాదకరమైన డ్రోన్ల జాబితాలో టర్కీ రెండో స్థానంలో ఉంది. టర్కీ వద్ద బేరక్తార్ TB2 , అకిన్సీ వంటి శక్తివంతమైన డ్రోన్‌లు ఉన్నాయి. ఇవి తక్కువ ధరలో అధిక నాణ్యత, సమర్థతను కలిగి ఉండటం విశేషం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ వీటిని సమర్థవంతంగా ఉపయోగించింది. ఇటీవల పాకిస్తాన్‌కు టర్కీ సరఫరా చేసిన డ్రోన్‌లను భారత్ విజయవంతంగా కూల్చివేసింది.డ్రోన్ టెక్నాలజీలో చైనా మూడో స్థానంలో నిలిచింది. చైనా వద్ద అనేక ప్రత్యేకమైన డ్రోన్‌లు ఉన్నాయి, వాటిలో వింగ్ లూంగ్ 2 మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ డ్రోన్ ముఖ్యమైనది. ఈ డ్రోన్‌ను ప్రధానంగా నిఘా వ్యవస్థ, గూఢచర్య కార్యకలాపాల కోసం చైనా వాడుతోంది. డ్రోన్ టెక్నాలజీలో ఇజ్రాయెల్ నాలుగో స్థానంలో ఉంది. ఇజ్రాయెల్ వద్ద హీరోన్ టీపీ అనే అత్యాధునిక డ్రోన్ ఉంది. ఇది 12.5 కిలోమీటర్ల (41,000 అడుగులు) ఎత్తు వరకు ప్రయాణించగలదు మరియు 27 గంటల వరకు ఏకధాటిగా ఆపరేట్ చేయవచ్చు. ఈ హీరోన్ టీపీ డ్రోన్‌లను భారతదేశం కొనుగోలు చేసింది. భారత ఆర్మీ వీటిని సమర్థవంతంగా వినియోగిస్తోంది.డ్రోన్ టెక్నాలజీలో భారతదేశం ఐదో స్థానంలో ఉంది. భారత్ వద్ద స్వదేశీ పరిజ్ఞానంతో అభి వృద్ధి చేసిన రుస్తోమ్-2 డ్రోన్‌లు ఉన్నాయి, వీటిని తపాస్-బీహెచ్ డ్రోన్‌లు అని కూడా పిలుస్తారు. టాక్టికల్ ఎయిర్ బార్న్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఏరియల్ సర్వేలెన్స్ అని అర్థం. ఇవి మానవరహిత వాహనాలు. ఈ డ్రోన్‌లకు ఆయుధాలు, రాడార్లు, ఇతర యుద్ధ సామగ్రిని మోసుకెళ్లగల సామర్థ్యం ఉంది. భారతదేశం డ్రోన్ టెక్నాలజీలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో వేగంగా ముందుకు సాగుతోంది.ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల ప్రాము ఖ్యత రోజురోజుకు పెరుగుతోంది. భద్రతా దళాలకు ఇవి కీలకమైన ఆయు ధాలుగా మారాయి. నిఘా, దాడులతో పాటు లాజిస్టిక్స్, సరిహద్దు పర్య వేక్షణ లోనూ వీటి పాత్ర అనిర్వచనీయం. రాబోయే కాలంలో డ్రోన్ టెక్నా లజీలో మరిన్ని విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని అంచనా వేస్తు న్నారు. ఈ రంగంలో పెట్టుబడులు, పరిశోధనలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## పవన్ కళ్యాణ్ కొత్త కార్యక్రమం.. ప్రజా సమస్యలకు అక్కడే పరిష్కారం!




**అమరావతి,:** సినీ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన పవన్ కళ్యాణ్.. రాజకీయాల్లో సైతం తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పవన్ పరపతి బాగానే పెరిగింది. అంతేకాదు వినూత్న కార్యక్రమాలతో ముందుకు దూసుకెళ్తున్నారు. ఇప్పటికే పల్లె పండగ, అడవి తల్లిబాట కార్యక్రమాలు నిర్వహించిన జనసేన అధ్యక్షుడు పవన్.. ఇప్పుడు మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'మన ఊరి కోసం మాటామంతీ' పేరుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, సరాసరి కలిసేందుకు సమయం కుదరని పరిస్థితుల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక ఊరితో ఒకరోజు మాట్లాడేలా ఈ కార్యక్రమం డిజైన్ చేసారు. ఈ కార్యక్రమంలో సమస్యలకు దాదాపు అక్కడే పరిష్కారం దొరికేలా చేస్తారు. రేపు మొట్టమొదటిగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలోని రావివలసలో మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంగళగిరి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్ పాల్గొంటారు. రావివలస గ్రామంలో స్క్రీన్ ఏర్పాటు చేసి వారితో మాట్లాడాలని ముందుగా అనుకున్నా.. ఓవైపు ఎండ, మరోవైపు వర్షాల కారణంగా టెక్కలిలోని భవానీ థియేటర్‌ను వేదికగా ఎంచుకున్నారు. మంగళగిరిలో తన కార్యాలయం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా గ్రామస్థులతో మాట్లాడతారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్సులో పాల్గొననున్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలపై జనసేనాని ప్రధానంగా దృష్టి పెట్టారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

## వర్షాలు పడుతున్నాయి, అప్రమత్తంగా ఉండండి.. అధికారులకు సీఎం ఆదేశాలు..!






**హైదరాబాద్, :** హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ ను ఆదేశించారు. ఇక వాతావరణశాఖ ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు పడతాయన్న కారణం చేత సీఎం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

## కార్యకర్తల బాధ్యత నాది, పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్ద కొడుకులా అండగా ఉంటా!



**అమరావతి,:** ఇకపై కార్యకర్తల బాధ్యత తనదే అని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటానని చెప్పారు. టీడీపీకి కార్యకర్తలే బలమని, ఇకపై కార్యకర్తలను నేరుగా కలుసుకోవాలని మంత్రి నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటి రెడ్డి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని వారితో లోకేష్ భేటీ అయ్యారు. వెన్నా బాలకోటి రెడ్డి నాలుగు దశాబ్దాలుగా పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమ కోసం పనిచేశారని మంత్రి నారా లోకేష్ అన్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అండతో బాలకోటి రెడ్డిని కొందరు తుపాకీతో కాల్చి చంపారని ఫైర్ అయ్యారు. హత్యకు ఆరు నెలల ముందు కత్తులతో దాడికి యత్నించగా బాలకోటి రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని, రక్షణ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. బాలకోటి రెడ్డి హత్య కేసులో నిందితులకు శిక్ష తప్పదని మంత్రి లోకేష్ హెచ్చరించారు. బాలకోటి రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## నోరు అదుపులో పెట్టుకో.. కేటీఆర్ పై ఐలయ్య ఫైర్..!





**హైదరాబాద్, :** ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చెక్కినట్లుగా ప్రవర్తిస్తున్నాడని ఆయన ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి గురించి అవాక్కులు, చావాక్కులు మాట్లాడటం తగదన్నారు. అంతే కాకుండా అయన మాట్లాడుతూ.. కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రులు అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటి ప్రాజెక్టుల పరంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందుండి వాటిని నడిపిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలి కులేశ్వరం గా మారిందని ఎద్దేవా చేసారు. ఈసారి కాళేశ్వరం లేకపోయినా రికార్డు స్థాయిలో పంట పండింది. ఇది మీ కళ్ళకి కనిపించడం లేదా? నల్గొండ జిల్లా మా హయాంలో అన్నం పెట్టే జిల్లాగా మారింది. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులను సీఎం రేవంత్ రెడ్డి సరిదిద్దుతున్నారని అన్నారు. స్కాంల చరిత్ర ఆ పార్టీదే అని బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసారు. ఇక వేయి ఎలుకలు తినిన పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కేసీఆర్ ప్రవర్తిస్తున్నాడని.. కేటీఆర్ మా సీఎంపై నోరు జారితే, నోటిని యాసిడ్‌తో కడుగుతాం.. జాగ్రత్తగా ఉండాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# సూర్యుడిపైకి సాగర మేఘాలు

- 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్'తో సూర్యరశ్మి వెనక్కు!
- సముద్ర మేఘాల్లోకి జల శతఘ్నుల ప్రయోగం
- చిక్కబడిన మేఘాలతో సూర్య 'శౌర్యం' తిరుగుముఖం
- భూతాపాన్ని తగ్గించేందుకు జియో ఇంజనీరింగ్ వ్యూహం
- ఐదేళ్లలో ప్రయోగాలు
- సక్సెస్ అయితే భూగ్రహం ఇక చల్లని గృహమే!



స్పెషల్ డెస్క్- ఇది కూడా యుద్ధం వంటిదే! అయితే దేశాల మధ్య యుద్ధం కాదు. శాస్త్ర పరిశోధకులు సూర్యుడిని మసకబార్చి భూమిని చల్లబరిచేందుకు చేయబోతున్న మహా ప్రయోగ సంగ్రామం! ఈ జాజ్వల్యమాన జల వ్యూహంలో సముద్రతలం నుంచి నౌకలు, గగనతలం నుంచి విమానాలు ఉప్పు నీటి శతఘ్నులను సంధించి, తమ చెయ్యెత్తులో ఉన్న సాగర మేఘాలను చిక్కబరిచి వాటిని దట్టంగా మార్చేస్తాయి. ఆ బాహుబలి మేఘాలు, సూర్యుడి నుంచి వచ్చే తీక్షణమైన కిరణాలను అడ్డుకుని, వాటిని తిరిగి వెనక్కు అంతరిక్షంలోకి పంపిస్తాయి! వేడిమి నుంచి భూమిని కాపాడతాయి. మహోష్ణ గోళంతో మనిషి తలపడనున్న ఈ ఆపరేషనే 'ఎంసీబీ'. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్! మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ అనేది ఒక జియో ఇంజనీరింగ్ టెక్నిక్. భూతాపాన్ని అరికట్టే ప్రయత్నంలో, భూ వాతావరణాన్ని ప్రభావితం చేసే పర్యావరణ ప్రక్రియలను పెద్ద ఎత్తున మార్చడమే జియో ఇంజనీరింగ్. ప్రపంచవ్యాప్తంగా, మహా సముద్రాలపై సూర్యరశ్మిని వెనక్కు పంపించేలా వాతావరణంలోకి కృత్రిమ రసాయన వాయు కణాలను చొప్పించటం, భూతాప నియంత్రణకు సముద్రపు నీటిలో కరిగి ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ను పీల్చి పారేయటం వంటి అత్యంత క్లిష్టమైన ప్రాజెక్టుల వంటి అన్నీ జియో ఇంజనీరింగ్ వ్యూహంలో భాగమే.

### ఎంసీబీ ప్రయోగాన్ని ఎలా చేస్తారు?

వాతావరణంలోకి ఉప్పు నీటిని 'ఎగచిమ్మటం' ద్వారా సముద్ర మేఘాలను కృత్రిమంగా అత్యంత ప్రకాశవంతం చేయటమే మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్. దీనివల్ల ఏర్పడే ఉప్పు నీటి వాయు బిందువులు సముద్ర మేఘాల సాంద్రతను పెంచుతాయి. ఆ మేఘాలను ఢీకొని సూర్యరశ్మి వెనక్కు (పైకి) మళ్లుతుంది. దాంతో భూమి సంగ్రహించే ఉష్ణోగ్రత తగ్గి, భూతాప నివారణ జరుగుతుంది. సముద్రపు మేఘాలు సహజంగా మహాసముద్రాలపై ఏర్పడతాయి. అందుకు సముద్రపు ఉప్పు కీలకమైన పదార్థంగా పనిచేస్తుంది. సముద్రపు ఉప్పు కణాలు గాలి ద్వారా కదిలినప్పుడు అవి మేఘ బిందువులకు కేంద్రకాలుగా మారి, నీటి ఆవిరి వాటిపై ఘనీభవిస్తుంది. ఈ మేఘ బిందువుల సంఖ్య, పరిమాణం ఒక మేఘం ఎంత సూర్యరశ్మిని తిప్పి కొడుతుందో నిర్ణయిస్తాయి. ఇదంతా సహజ ప్రక్రియ. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ విధానంలో సముద్ర మేఘాలకు మరిన్ని సముద్రపు ఉప్పు కణాలను జోడించడం ద్వారా ఈ సహజ ప్రక్రియను అనుకరించడం, మెరుగుపరచడం జరుగుతుంది. మెరైన్ స్నో మెషీన్లను, ప్రత్యేకమైన నాళాల వంటి పరికరాలను ఉపయోగించి సముద్రపు ఉప్పు నీటిని గాలిలోకి చల్లడం ద్వారా ఈ ప్రయోగం చేస్తారు.

### 35 ఏళ్ల ప్రయత్నాలు.. 5ఏళ్లలో ప్రయోగాలు!

1990లలో తొలిసారి బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త జాన్ లాథమ్‌కు ఈ 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్' ఆలోచన వచ్చింది. ప్రయోగాలకు అనుకూలమైన సముద్ర ప్రాంతాలపై మేఘాలను ప్రకాశవంతం చేయడం వల్ల భూతాపాన్ని పెరగకుండా చేయవచ్చని ఆయన తలపోశారు. ఎలాగంటే... ప్రత్యేక స్ప్రేయర్‌లతో వాతావరణంలోకి చిన్నపాటి సముద్రపు నీటి బిందువులను ఎగజిమ్ముతారు. ఇవి ఆవిరైపోయి ఉప్పు కణాలను మిగులుస్తాయి. ఆ కణాలు దట్టమైన, ప్రకాశవంతమైన మేఘాలను సృష్టిస్తాయి. అవి సూర్యరశ్మిని అడ్డుకుని భూమి మీద వాటి తీవ్రతను తగ్గిస్తాయి. ఇదీ జాన్ లాథమ్ ఆలోచన. ఇన్నేళ్లకు ఈ ఆలోచన ప్రయోగ దశకు చేరుకుంది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రయోగం ఆచరణలోకి రావచ్చని ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూరుస్తున్న 'ఆరియా' అనే బ్రిటన్ సంస్థ అంచనా వేస్తోంది.

### రహస్య పరిశోధనా సంస్థ 'ఆరియా'

భూతాప వేగాన్ని నెమ్మదిపరిచే లక్ష్యంతో అనేకమైన జియో ఇంజనీరింగ్ ప్రాజెక్టు పనులు చేపట్టటానికి 'అరియా' అడ్వాన్డ్ రీసెర్చ్ ఇన్వెషన్ ఏజెన్సీ' ఏర్పాటైంది. ఇందుకోసం ఈ ప్రభుత్వ రహస్య పరిశోధనా సంస్థ ఇంతవరకు ప్రజా పన్నుల నుంచి 800 మిలియన్ పౌండ్లను సమకూర్చుకుంది. ఇందులో ఒక్క మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ ప్రాజెక్టుకే 57 మిలియన్ పౌండ్లను బ్రిటన్ ప్రభుత్వం కేటాయించింది. అనధికారికంగా 2021 ఫిబ్రవరిలో, అధికారికంగా 2023 జనవరిలో ఈ సంస్థ ప్రారంభం అయింది. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే శాస్త్రీయ, సాంకేతిక పురోగతులను ఆవిష్కరించమే తన ధ్యేయం అని ఈ సంస్థ చెబుతోంది. "ఎంతో ఊహాజనితమైన, అతి కష్టతరమైన, వేరే చోట జరగటం అసంభవం అయిన పరిశోధనలను కొనసాగించడానికి మేము శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అధికారం ఇస్తాం" అని అరియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇలాన్ గుర్ అంటున్నారు.

### ఎంసీబీ ప్రయోజనాలు

మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ భూమి గ్రహించే సూర్యరశ్మి పరిమాణాన్ని తగ్గించి భూతాపాన్ని నివారిస్తుంది. భూగోళాన్ని చల్లబరిచి వేడిగాలులు లేకుండా, కరువు కాటకాలు రాకుండా చేయగలదు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను తగ్గించి, పగడపు దిబ్బలు క్షీణించకుండా కాపాడుతుంది.

### ఎంసీబీ దుష్ప్రభావాలు


వాతావరణ సమతౌల్యం, భూమికి నీటిని అందించే 'అవపాత చక్రం' (వర్షపు జల్లులు, మంచు, వడగళ్లు కురిసే కుదురైన వ్యవస్థ) దెబ్బతినే ప్రమాదం ఉంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రించే 'ఎల్ నినో' గతి తప్పవచ్చు. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలు నిష్ఫలం కావచ్చు.

# 'అఖిలపక్షం వేళ' అనైక్యత!




దేశం కోసం సమష్టిగా కదలాల్సిన సందర్భాల్లో సైతం కలవలేనంతగా అధికార విపక్షాలు ఎడ మొహం పెడమొహంగా మారాయి. పెహల్‌గామ్‌లో గత నెల 22న ఉగ్రవాదులు సాగించిన మారణ కాండ మొదలు మన ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్, ఈ నెల 10న కాల్పుల విరమణ, పాకిస్తాన్ దురాలోచనలూ వగైరా ప్రపంచానికి తెలియజెప్పేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల కూర్పు ప్రక్రియ వివాదాస్పదంగా మారటం దీన్ని చాటుతోంది. మన దేశంనుంచి సమష్టి స్వరం వినబడితే దాని ప్రభావం వేరుగా వుంటుంది. పాకిస్తాన్ సైతం ఇదే తరహాలో అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపటానికి సన్నాహాలు చేసుకుంటున్నది. కనీసం ఇందుకోసమైనా విభేదాలు పక్కనబెట్టి ఒక్కటై నిలబడదామన్న స్పృహ అటూ ఇటూ కరువవుతోంది. ఏ దేశంలోనూ ఇలా వుండదు. అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రం (డబ్ల్యూటీసీ)పై ఉగ్రదాడి మొదలు ఇందుకు ఎన్నయినా ఉదాహరణలివ్వొచ్చు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరుతో అమెరికా అఫ్గాన్‌ను వల్లకాడు చేసింది. చివరకు ఒరిగిందేమీ లేదు. అఫ్గాన్‌నుంచి అవమానకరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. అయినా అక్కడి విపక్షం మౌనంగా ఉండిపోయింది. కానీ ఇక్కడలా కాదు. యూపీఏ హయాంలో ముంబైపై ఉగ్రదాడి, దానికి వెనకాముందూ జరిగిన అనేకానేక ఉదంతాల్లో మన దేశంలో అధికార పక్షంపై విపక్షం విరుచుకుపడటం, యక్షప్రశ్నలు వేసి ఇరుకున పడేసే ప్రయత్నం చేయటం రివాజుగా మారింది. యూపీఏ హయాంలో బీజేపీ విపక్షంలోవుండి ఏం చేసేదో, ఇప్పుడు కాంగ్రెస్ సైతం ఆ పనే చేస్తోంది. పుల్వామా ఉగ్రదాడి సమయంలో మరీ దారుణం. జవాన్ల త్యాగాలూ, వారు దెబ్బకు దెబ్బ తీసిన వైనమూ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చర్చనీయాంశంగా మారటం ఆశ్చర్యపరిచింది. ఈ ఉదంతాలను బీజేపీ తనకను కూలంగా మలుచుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం చాటింపు వేసింది. అయితే మన దేశంలోనూ ఒకప్పుడు అధికార, విపక్షాలు కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాలు లేకపోలేదు. ఇందుకోసం ఎన్నడో 1971 నాటి భారత్-పాక్ యుద్ధం వరకూ పోనవసరం లేదు. 1994లో కశ్మీర్‌పై భారత్ వైఖరిని వివరించటానికి నాటి ప్రధాని పీవీ నరసింహారావు రూపొందించిన అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించింది అప్పటి విపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి! పాతికేళ్ల క్రితం కార్గిల్ యుద్ధ సమయంలో నాటి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెస్‌తోసహా విపక్షాలూ దేశభద్రత కోసం కలిసికట్టుగా పనిచేశాయి. కానీ ఇప్పుడెందుకు పరస్పరం తప్పులు వెదుక్కొనే తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నట్టు? దేశంలో తక్షణం వచ్చే ఎన్నికలేమీ లేవు. అయినా పెహల్‌గామ్‌ను రాజకీయంగా వినియోగించుకోవటానికి అటూ ఇటూ పోటీపడుతున్నారు. త్రివిధ దళాల అధికార ప్రతినిధులు చెప్పేవరకూ ఆగకుండా ఇష్టానుసారం ఉన్నవీ లేనివీ ప్రచారం చేసి, విపక్షాలను పాకిస్తాన్ అనుకూలురుగా, దేశద్రోహులుగా చూపటానికి బీజేపీ శ్రేణులూ, సాను భూతిపరులూ చేయని ప్రయత్నం లేదు. తొలి ప్రధాని నెహ్రూ ఉదారంగా పాకిస్తాన్‌కు నదీజలాలు, భారీయెత్తున సొమ్ము కట్టబెట్టారని బీజేపీ నేతలు ఇంకా ఆరోపణలు గుప్పిస్తూనే వున్నారు. ఒకపక్క అఖిలపక్షాన్ని పంపుతూ మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? వీటిని ఎలా ఎదుర్కొనాలో తెలియక ఇష్టానుసారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చులకనవుతున్నారు. యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి... మనవైపు జరిగిన నష్టమెంత అంటూ రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇవి అడగకూడని ప్రశ్నలేమీ కాదు... కానీ అందుకు తగిన వేదికను ఎంచుకోవాలని కూడా ఆయనకు తోచదు. ఇంతకూ అఖిలపక్ష బృందాల కూర్పుపై ఇంత వివాదం ఎందుకొచ్చినట్టు? విపక్షాలను విశ్వా సంలోకి తీసుకుని, వారు పంపిన పేర్లనుంచి ఎంపికచేసే కనీస మర్యాద అధికార పక్షం పాటించివుంటే సమస్య తలెత్తేది కాదు. విపక్షానికి ఆలోచించే శక్తిసామర్థ్యాలు లేవన్నట్టు సర్కారు ప్రవర్తించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు సభ్యుల పేర్లు పంపితే వారిలో ఒక్కరినే ఎంపిక చేసింది. పోనీ సర్కారు ఎంచుకున్నది కూడా సమర్థుల్నే కదా అనే సర్దుబాటు ధోరణి కాంగ్రెస్‌కు లేదు. అసలు ఆ పార్టీ నుంచి వెళ్లిన జాబితాలో సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్, మనీష్ తివారీ తదితరుల పేర్లు ఎందుకు లేకుండా పోయినట్టు? సీనియర్ నేత ఖుర్షీద్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం తీరా ఆయన సీనియారి టీని కాదని జేడీ(యూ) నేత సంజయ్ ఝాకు సారథ్య బాధ్యతలు ఎందుకిచ్చినట్టు? సమష్టి స్వరం వినబడాల్సిన ఈ సమయంలో ఇన్ని లుకలుకలుండటం మంచిదేనా? ఇంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ చివరకు ఈ వివాదాన్ని పొడిగించదల్చుకోలేదని చేతులెత్తేసింది. కానీ ఎప్పుడూ వీరంగం వేసే అలవాటున్న తృణమూల్ మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన సభ్యుణ్ణి తప్పుకోమని చెప్పింది. దాంతో ప్రభుత్వం తగ్గి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ సూచించిన నేతకు స్థానం కల్పించింది. అఖిలపక్షం పంపటంలోని ఉద్దేశమే సమష్టితత్వాన్ని, ఈ దేశ సంకల్పాన్ని, పాకిస్తాన్ కుయుక్తులను చాటడానికైనప్పుడు సభ్యుల ఎంపిక వివాదాస్పదం కాకుండా ప్రభుత్వం చూడాల్సింది. ఈమధ్య ఆపరేషన్ సిందూర్ మొదలుకొని పార్టీ వైఖరికి భిన్నంగా పలు ప్రకటనలిస్తూ సంచలనం సృష్టిస్తున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేయకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన్ను ఏరికోరి ఎంపిక చేయటం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికేనన్న విషయంలో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ఏదేమైనా ఇలాంటి సంక్షోభ సమయాల్లో అవసరమైన సంయమనం, హుందాతనం ఇరువైపులా కనబడకపోవటం దురదృష్టకరం.

# అప్పుడు మనిషి జీవితం నాలుగేళ్లే!



తేనె.. ఎంత రుచికరమో అంత ఆరోగ్యదాయకం. ప్రతిరోజూ తగిన మోతాదులో తేనె ను తీసుకోవడం ద్వారా పలు అనారోగ్యాల బారి నుంచి బయటపడవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. భూమిమీద కష్టించే జీవుల జాబితాలో తేనెటీగలు ముందుంటాయి. ఒకవైపు పర్యావరణాన్ని కాపాడుతూ, మరోవైపు మనకు ఆరోగ్యాన్ని అందిస్తున్న తేనెటీగలకు సంబంధించిన చాలా విషయాలు మనకు తెలియదు. రాయల్ జియోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ లండన్ సైంటిస్టులు తెలిపిన వివరాల ప్రకారం భూమి మీద తేనెటీగలు లేకపోతే మనిషి జీవితం దుర్భరమవుతుంది. నేడు (మే 20) ప్రపంచ తేనేటీగల దినోత్సవం. ఈ సందర్భంగా తేనెటీగలు పర్యావరణానికి అందించే సాయాన్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. భూమి మీద బతికే హక్కు మనిషికి ఎంత ఉందో, మిగతా జీవరాశులకూ అంతే ఉంది. అయితే మనిషి తన అవసరాల కోసం మిగిలిన జీవుల ఉనికికి ముప్పు వాటిల్లే పనులు చేస్తున్నాడు. జీవ వైవిధ్యం కరువైతే ప్రకృతిలో సమతుల్యత దెబ్బతింటుంది. చివరికి ఆ ప్రభావం మనిషి మీదే పడుతుంది. రాయల్ జియోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ లండన్ సైంటిస్టులు చెప్పినదాని ప్రకారం తేనెటీగలు లేని భూమి మీద మనిషి కేవలం నాలుగేళ్లు మాత్రమే బతకగలడు. మిగిలిన జీవులు కూడా దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుంటాయి. నాడు ప్రముఖ శాస్త్రవేత్త ఐన్ స్టీన్ కూడా 'తేనెటీగలు లేకపోతే మనిషి నాలుగేళ్ల కన్నా ఎక్కువ కాలం జీవించడం కష్టం' అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల సంఖ్య అంతకంతకూ క్షీణిస్తోంది. దాదాపు 90 శాతం తేనెటీగలు ఇప్పటికే అంతరించిపోయాయి. ప్రస్తుతం పదిశాతం మాత్రమే మిగిలాయి. భవిష్యత్తులో తేనెటీగలను ల్యాబ్‌లలో ప్రత్యేకంగా పెంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడేలా ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రపంచంలో పండించే 100 రకాల పంటలలో.. 90 రకాల పంటలు ఫలదీకరణం చెందాలంటే తేనెటీగలు ఎంతో అవసరం. దీని ప్రకారం చూస్తే, అధికశాతం శాతం వ్యవసాయం తేనెటీగల వల్లే జరుగుతోందని చెప్పుకోవచ్చు. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా సెల్ ఫోన్ వినియోగం మరింతగా పెరిగింది. సెల్ ఫోన్ సిగ్నల్స్ తేనెటీగలకు హాని కలిగిస్తున్నాయి. అవి తాము కట్టుకున్న గూడుకు వెళ్లే దారిని మర్చిపోయేలా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తేనెటీగలు మరణిస్తున్నాయని పలు పరిశోధనల్లో తేలింది. మన పర్యావరణ వ్యవస్థలను సజీవంగా ఉంచడంలో తేనెటీగలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com